ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 26 జూన్ 2024



మంగంపేట పల్వరైజింగ్ మిల్లులకు ముగ్గురాయి సరఫరా ఆగిపోవడంతో నిలిచిపోయిన లారీలు

పల్వరైజింగ్ మిల్లులకు
ముగ్గురాయి నిలిపివేత

- గనుల నుంచి వచ్చిన రాయిని స్టాకు పాయింట్‌కు తరలిస్తున్న వైనం
- కొలిక్కిరాని రూ.50 కోట్ల అనుతిమతి లేని ముగ్గురాయి వ్యవహారం

రైల్వేకోడూరు, జూన్ 25: గత వైసీపీ ప్రభుత్వంలో ఏపీఎండీసీలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఈనేపథ్యంలో కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చేందుకు విజయవాడలోని ఏపీ యండీసీ ప్రధాన కార్యాలయానికి తాళాలు వేశారు. కాగా, ఇప్పటి వరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేట ముగ్గురాయిని పల్వరైజింగ్ మిల్లులకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం విజయవాడ కార్యాలయం నుంచి తగిన ఆదేశాలు లేకపో వడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి మంగంపేట గనుల నుంచి పల్వరైజింగ్ మిల్లులకు ముగ్గురాయి సరఫరాను ఆపేశారు. గనుల నుంచి వెలికితీస్తున్న రాయిని మాత్రం ఏపీయండీసీ స్టాకు పాయింట్‌కు తరలిస్తున్నట్లు ఏపీయండీసీ సీపీవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. స్టాకు పాయింట్‌లో ప్రస్తుతం ఏ-గ్రేడు 45 వేల టన్నులు, బీ-గ్రేడు 95 వేల టన్నులు, సీ.డీ-గ్రేడు ముగురాళ్లు 79 లక్షల టన్నులు ఉన్నాయని ఆయన వివరించారు.

కొలిక్కిరాని రూ.50 కోట్లు విలువజేసే ముగ్గురాళ్ల తరలింపు

సాధారణంగా ప్రతి ఏటా ముగ్గురాయి విక్రయాలకు సంబంధించి ఏపీఎండీసీ టెండర్లను వేస్తుంటారు. ఇది చాలా ఏళ్లుగా ఒక పద్ధతి ప్రకారం సాగింది. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత టెండర్లు భిన్నంగా సాగాయి. వైసీపీ నాయకులకు చెందిన పల్వరైజింగ్ మిల్లులకు మాత్రమే ఎక్కువ ముగ్గురాయిని సరఫరా చేసేవారు. ఈ నేపథ్యంలో మంగంపేట పరసర ప్రాంతంలో ఉన్న గత ఎండీ బంధువుకు రూ.50 కోట్లు విలువ చేసే ముగ్గురాయిని అనుమతి లేకుండా ఇచ్చారని... అలాగే వైసీపీ నాయకులకు చెందిన మిల్లులకు ముగ్గురాయిని అనుమతి లేకుండానే తరలించారనే ఆరోపణలున్నాయి. దీనిపై విచారణ అధికారిగా నియమించిన వ్యక్తి ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. దీనిపై విజిలెన్సు అధికారులు విచారణ చేపట్టినా.. ఇంతవరకు ఏమీ తేల్చ లేదు. నివేదిక ఎక్కడ ఉందో కూడా అంతు పట్టడం లేదు. ఈ విషయంలో చాలా మందికి ప్యాకేజీలు అందాయని ఆరోపణ లు వెల్లువెత్తున్నాయి. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలోనైనా మంగంపేట గనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని బాధిత పల్వ రైజింగ్ యాజమనాలు కోరుతున్నారు.

గనుల్లో ముగ్గురాళ్లను వెలికితీస్తున్న యంత్రాలు



- దిగుబడి తగ్గినా.. ధరలు లేక..
- కిలో రూ.40-60 పడిపోయిన ధర
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు, వ్యాపారులు

తెల్లబోయిన నల్లపండు
అలరించని అల్లనేరేడు..!

మదనపల్లె, జూన్ 25: దివ్యౌషధంగా చెప్పుకునే అల్లనేరేడు ధరలు ఈసారి పడిపోయాయి. గతేడాది పంటదిగుబడి ఎక్కువ రావడంతో డిమాండ్ లేక ధరలు పడిపోగా.. ఈ ఏడాది వర్షం, ఊజీ, మచ్చలతో పండు పగిలి ధరల పతనానికి కారణమైంది. కిలో రూ.280 నుంచి రూ.300 పలికిన నల్లపండు ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో రూ.40 నుంచి రూ.60లకు పడిపోయాయి. దీంతో మార్కెట్‌కు తెచ్చినా కూలీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో రైతులు, వ్యాపారులు పండ్లను కోయకుండానే చెట్లు, మాండ్లలో వదిలేస్తున్నారు.

గతేడాదితో పోలిస్తే.. ఈసారి సీజన్‌లో వర్షాభావం నెలకొంది. దీంతో ఆశించిన స్థాయిలో పిందె, పూత లేదు. నీటి ఆధారం ఉన్న తోటలు మాత్రమే కాపునకు వచ్చాయి. అది కూడా 40శాతం మాత్రమే చివరగా కాపు నిలిచింది. ఫలితంగా మామిడి తరహాలోనే ఈసారి మంచి ఫలితాలు ఉంటాయని ఊహించిన రైతుల ఆశలు తలకిందులయ్యాయి. ఈ క్రమంలో సీజన్ ప్రారంభమైన మే 15వ తేదీ నుంచి నెలాఖరు వరకూ ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. జూన్ నుంచి వర్షాలు మొదలై..అప్పుడప్పుడు తుంపర్లు నుంచి ఓ మోస్తారు వర్షాలు కురుస్తుండటంతో పండు పగిలి రాలిపోతోంది. అలాగే తేమకు ఊజీ ఈగలు కుట్టడంతో మచ్చలు ఏర్పడుతున్నాయి. దీంతో పొలం నుంచి మార్కెట్‌కు తెచ్చినంత సేపు బాగున్నా.. తర్వాత బయటి మార్కెట్‌కు తరలించే క్రమంలో నీరుగారిపోతోంది. దీంతో బయట మార్కెట్ వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు. ఇదిలా వుండగా, మొదట్లో వచ్చిన పండ్ల పరిమాణం పెద్దగాను, మధ్యలో వచ్చే పంట అటు ఇటుగా, చివర్లో వచ్చే పండు పరిమాణం చిన్నగానే ఉంటుంది. మొదటి విడత వచ్చిన పండ్లు కిలో రూ.280 నుంచి రూ.300 పోగా, ప్రస్తుతం కిలో రూ.40 నుంచి రూ.60 పోతున్నాయి. ఇక సాయంత్రం మార్కెట్‌కు వచ్చే సరుకు తినడానికి కాకుండా జ్యూస్‌కు కొనుగోలు చేస్తున్నారు. దీన్ని మహారాష్ట్ర వ్యాపారులు కిలో రూ.40 చొప్పున కొంటున్నారు.



గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

మదనపల్లె కేంద్రంగా టమోటా తరహాలో అల్లనేరేడు మార్కెట్ కూడా ఏటికేడు పెరుగుతోంది. ఈక్రమంలో ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాలతో పాటు సరిహద్దులోని కర్ణాటక ఏరియాలలో సాగుచేసిన అల్లనేరేడు ఇక్కడి మార్కెట్‌ను ముంచెత్తుతోంది. ఇక్కడి నుంచి ఏపీ, తెలంగాణతో పాటు తమిళనాడు, ఈ సారి మహారాష్ట్రకు ఎగుమతి చేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో కిలో రూ.280 నుంచి రూ.300 పలికింది. దీంతో వ్యాపారులు, రైతుల మోముల్లో సంతోషం కనిపించింది. సీజన్ మొత్తం ఇలాగే ఉంటుందని భావించారు. కానీ వర్షం వారి ఆశలపై తుంపర్లు చల్లింది. ఈక్రమంలో కిలో రూ.150, రూ.100 పడిపోయింది. ప్రస్తుతం పండు గట్టితనాన్ని బట్టి కిలో రూ.60 నుంచి రూ.40 పడిపోయింది. దీంతో పంటను కోసి, మార్కెట్‌కు తెచ్చిన రైతు, వ్యాపారికి నష్టామే పెట్టుబడిగా మారింది. ఈ పరిస్థితిలో చేసేది లేక వ్యాపారులు మొదటి, రెండో కాపుతోనే సరిపెడుతున్నారు. మార్కెట్‌కు తెచ్చిన కూలీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో పంటనే కాదు..తోటలోని చెట్లు, మాండ్లను వదిలేస్తున్నారు. కొందరు రైతులు మాత్రం కూలీలను పెట్టి పంటను గ్రేడింగ్ చేసి క్రేట్లను మార్కెట్‌కు రవాణా చేస్తున్నారు. మొదటి రకం మాత్రం మంచి ధర పలుకుతుండగా, రెండోరకం రూ.40-60 పోతుండగా, మూడోరకాన్ని పారేస్తున్నారు.

సాధారణంగా అటు రైతులు, ఇటు వ్యాపారులు.. మామిడి, అల్లనేరేడు పంటను ఓ పంట కాపు..మరోపంట బీడు.. అనే లెక్కగా పిలుస్తుంటారు. అందుకే రెండేళ్లకు ఒకేసారి కొనుగోలు చేస్తుంటారు వ్యాపారులు. ఈ క్రమంలో గతేడాది ఈ పంటకు సరిపోయేలా వర్షం సకాలంలో కురవడంతో పంట దిగుబడులు బాగా వచ్చాయి. అయితే ధరలు లేవు. ఈ విషయాన్ని పక్కన పెడితే, కాపు పరంగా ముందుగా అంచనా వేసినట్లే 40 శాతానికి మించలేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కొత్తవ్యాపారులు కూడా మార్కెట్‌లోకి వచ్చారు. రేట్లు పెట్టి తోటలు తీయడమే కాదు.. రూ.లక్షలు ఖర్చు పెట్టి సస్యరక్షణ చర్యలు కూడా చేపట్టారు. ఒకప్పుడు నాలుగైదు చెట్లకే పరిమతమైన రైతులు ఖాళీ ప్రదేశాల్లో పెంచడం, మరి కొందరు గిట్టుబాటు కాని వ్యవసాయాన్ని వదిలేసి దీర్ఘకాలిక ఫలసాయాన్నిచ్చే పండ్ల తోటలు సాగు చేశారు. ఇందులో ఎక్కువగా అల్లనేరేడు తోటలే ఉంటున్నాయి. ఏటా కాపునకు వచ్చే తోటలు కూడా ఉంటున్నాయి. సీజన్ ప్రారంభం నుంచి కాయ పక్వానికి వచ్చే లోపు మూడుసార్లు పిచకారి మందులు కొట్టాల్సి వుంది. అవి అదును దాటి కొడితే ప్రయోజనం లేదని, ఈసారి చాలా మంది ఎన్నికల్లో ఉండటం వల్ల కూడా మందులు కొట్టలేదని చెబుతున్నారు. సకాలంలో మందులు పిచకారి చేయకపోవడం కూడా మచ్చలు రావడానికి కారణమని వ్యాపారులు వాపోతున్నారు. రైతుల నుంచి ఆలస్యంగా కొనగోలు చేసిన పంటలకు మచ్చల బెడద ఎక్కువగా ఉందని చెబుతున్నారు.



మొదటి రకం అల్లనేరేడు

వర్షం, ఊజీ ఈగలు దెబ్బతీశాయి



తాను కొన్నేళ్లుగా అల్లనేరేడు వ్యాపారం చేస్తున్నా. రూ.70లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి రైతుల నుంచి పంటలు కొనగోలు చేశా. ఈసారి కచ్చితంగా చివరి వరకూ కిలో రూ.వంద ఎక్కువగానే ఉంటుందని భావించాం. ఎక్కడ చూసినా మామిడికి మించి అల్లనేరేడు తోటలు సాగు చేస్తున్నారు. కొత్తగా కాపునకు వచ్చేవి ప్రతి సంవత్సరం ఉంటున్నాయి. ఉన్నట్లుండి మందులు కొట్టే సమయానికి వర్షాలు పడ్డాయి. అప్పటికప్పుడు మందులు కొట్టినా.. ప్రయోజనం లేదు. వర్షాలు, ఊజీ ఈగలు అల్లనేరేడును బాగా దెబ్బతీశాయి. దిగుబడి ఎక్కువగా ఉన్నా..పండు సైజు, క్వాలిటీ బాగా ఉంటే గిట్టుబాటు ధరలు ఉంటాయి.

- పాకాల హరి, హోల్‌సేల్ వ్యాపారి, మదనపల్లె.

ఆలస్యంగా మందులు కొట్టి..



ధర ఎక్కువగా పోతుందని చెట్లు అమ్మకంలో రైతులు ఆలస్యం చేశారు. వారు అనుకున్న ధరలు పోకపోవడంతో వ్యాపారులు అడిగినంతకు తోటలు ఇచ్చేశారు. అప్పటికప్పుడు వ్యాపారులు మందులు పిచికారి చేయడంతో కాయకు పట్టలేదు. ఆలస్యం కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో పండుపై మచ్చలు ఏర్పడ్డాయి. వర్షం కూడా తోడు కావడంతో పండు పగిలి ధరలు తగ్గుముఖం పట్టాయి. మొదట్లో కాయలు తక్కువ కావడంతో ధరలు బాగా పోయాయి. చిన్న సైజు కూడా కిలో రూ.160 నుంచి రూ.200 పోయాయి. ప్రస్తుతం బయటకు పంపితే అక్కడికి పోయేసరికి పండు పగిలి నీరుగారి పనికి రాకుండా పోతున్నాయి.

- సాకే కృష్ణమూర్తి, వ్యాపారి, మదనపల్లె.

వైసీపీలో సీఐడీ కలకలం

- శ్రీనివాసరెడ్డి హత్య కేసు ఎవరి మెడకు చుట్టుకుంటుందోనన్న గుబులు
- విచారణ మొదలెట్టిన సీఐడీ అధికారులు
- ఇప్పటికే కడపకు వచ్చిన బృందం
- నాడు శ్రీనివాసరెడ్డి కాల్ రికార్డే కీలకం

(కడప-ఆంధ్రజ్యోతి): భూకబ్జాలు, సెటిల్‌మెంట్లతో సొంతంగా ఎదుగుతుండడం.. లావాదేవీల్లో విభేదాలతో వైసీపీకి చెందిన శ్రీనివాసరెడ్డిని అతని సన్నిహితులే కత్తులతో పొడిచి పొడిచి చంపిన విషయం తెలిసిందే. అప్పుడు వైసీపీ గవర్నమెంటు ఉండడంతో ఈ కేసును చాలా సింపుల్‌గా మూసివేసి కీలక నేతలను తప్పించారంటారు. ఇప్పుడు టీడీపీ గవర్నమెంటు రావడం ఈ కేసు సీఐడీ చేతులకు వెళ్లడంతో ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి మంగళవారం ప్రముఖంగా ప్రచురించింది. సీఐడీ వ్యవహారం ఇప్పుడు వైసీపీలో కలవరం పుట్టిస్తోంది. ఈ కేసు ఎవరి మెడకు చుట్టుకుంటుందోనన్న భయంతె వైసీపీ నేత లు వణికిపోతున్నట్లు చెబుతున్నారు. పక్కాగా విచారణ జరిగితే శ్రీనివాసరెడ్డి హత్యకు పిన్‌పాయింట్ ఎవరో తెలిసే అవకాశం ఉందంటున్నారు. ఇదే జరిగితే.. భూకబ్జాలు, లావాదేవీలతో ఎన్నికోట్లు కొల్లగొట్టారు.. ఇందులో ఎవరి వాటా ఎంత, అసలు బాస్‌లు ఎవరో తెలిసిపోతుంది. నిందితులకు కఠినంగా శిక్ష పడితే భూకబ్జాలకు కళ్లెం పడుతుందని అంటున్నారు. ఈ కేసును సీఐడీ టేకప్ చేసిన తరువాత తిరుపతికి చెందిన బృందం ఇప్పటికే కడపకు వచ్చి పోయినట్లు చెబుతున్నారు.

భూములు మింగేశారు

వైసీపీ పాలనలో ఊరికో బకాసురుడు ఉన్నట్లుగా కడపలో కూడా వైసీపీకి చెందిన ఆ నలుగురు ఏరియాలు ఏరియాలుగా డివైడ్ చేసుకుని భూకబ్జాలకు పాల్పడ్డారంటారు. ఎంతగా అంటే ప్రైవేటు స్థలాల్లో నివాసం ఉన్న వారిని కూడా బెదిరించేసి ఖాళీ చేయించి స్వాధీనం చేసుకునే స్థాయికి దిగాయి. ఇక ఆ నలుగురి అనుచరులు కడపలో 147 గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకున్నారంటే జగన్ పాలనలో భూకబ్జాలతో ఎంత పేట్రేగిపోయారో అర్థమవుతుంది. ఇందులో ఓ ముఖ్యమైన గ్యాంగ్ శ్రీనివాసరెడ్డిది అంటారు. శ్రీనివాసరెడ్డి గ్యాంగ్ నాడు కడప నగరాన్ని నలుచెరుగులా చెరబట్టిన ఆ నలుగురికి భూసెటిల్‌మెంట్లు భారీగా చేశారంటారు. విలువైన స్థలం కనిపిస్తే శ్రీనివాసరెడ్డి గ్యాంగ్‌కు ఉప్పందిస్తే చాలు.. వెంటనే స్వాధీనం చేసుకుంటారని అంటున్నారు. అనతికాలంలోనే శ్రీనివాసరెడ్డి గ్యాంగ్ బాగా ఎదిగిపోయిందంటారు. ఆ నలుగురు నేతలకు సెటిల్ మెంట్లు చేయడంతో శ్రీనివాసరెడ్డికి ఏర్పడిన పరిచయాలు తాడేపల్లి వరకు వెళ్లడంతో లబ్ధి పొందిన వారే జీర్ణించుకోలేకపోయారంటారు. ఇలా సొంత సైన్యంతో చేసిన లావాదేవీల్లో తేడాలు రావడం, అతను ఆర్థికంగా ఎదగడంతో శ్రీనివాసరెడ్డిని గత ఏడాది జూన్ 23న నరికి చంపారు. అప్పట్లో ఈ ఘటన కలకలం రేపింది. బురఖాలు వేసుకుని కత్తులతో పొడవడం చూసి జనం భయాందోళనకు గురయ్యారు.

కేసు అలా నీరుగార్చారు

శ్రీనివాసరెడ్డి హత్యతో అప్పట్లో తెర వెనుక లబ్ధి పొందిన ముఖ్యులు ఉన్నారనే ప్రచారం సాగింది. కేసు విచారణలో భాగంగా అప్పుడు పోలీసులు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి డాక్యుమెంట్లతో పాటు సెటిల్‌మెంట్ల ద్వారా శ్రీనివాసరెడ్డి నమోదు చేసుకున్న డైరీని, మరి కొంత సమాచారాన్ని గుర్తించారంటారు. ఇక హత్య కేసుకు సంబంధించి కాల్ రికార్డులతో కీలకమైన సమాచారం బయటికి వచ్చిందని చెబుతారు. తీగలాగితే డొంక కదిలినట్లు ఫోన్‌కాల్స్ డేటాతో ఈ వ్యవహారం ప్రముఖుల గుట్టురట్టు చేసిందని సమాచారం. అయితే అప్పట్లో ఈ కేసు విచారించిన ఓ పోలీసు అధికారికి సెటిల్‌మెంటు బాస్‌గా పేరుంది. ఆయన వైసీపీకి ఊడిగం చేశారని అంటారు. ఆ అధికారి కాల్‌డేటాను పక్కనబెట్టేసి ఈ కేసునే డైవర్ట్ చేసి కేసులో ప్రముఖుల ప్రమేయం లేకుండా మమ అనిపించేసి సంబంధంలేని పేర్లను కూడా తెరపైకి తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. పేర్ల తొలగింపులో పెద్ద డీల్ జరిగిందంటారు. అయితే కేసు సీఐడీ చేతికి వెళ్లడంతో ఇప్పుడు పాత్రధారుల్లో భయం మొదలైందని చర్చ నడుస్తోంది.

సీన్ రీకన్‌స్ట్రక్షన్

శ్రీనివాసరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా సీఐడీ డీఎస్పీ మధులత ఆధ్వర్యంలో గత శనివారం ఓ బృందం కడపకు వచ్చింది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఈ హత్యకు సంబంధించిన ఫైలు వివరాలు తీసుకున్నారు. హత్య ఎక్కడ జరిగింది, ఎలా జరిగిందని హత్య జరిగిన సంధ్య సర్కిల్‌లోని రాబిట్ ఫిట్‌నెస్ సెంటరు వరకు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే కొందరిని విచారణకు రావలసిందిగా నోటీసులు ఇచ్చారని అంటున్నారు. ఎర్రముక్కపల్లెకు చెందిన ఓ వైసీపీ నేతకు కూడా నోటీసులు ఇచ్చినట్లు చెబుతారు.

పోలీసుల్లో మల్లగుల్లాలు

శ్రీనివాసరెడ్డి హత్య ఇప్పుడు కొందరు పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందంటారు. జగన్ జమానాలో కడపలో పనిచేసిన కొందరు సీఐలు రక్షకభటులం అన్నది మరిచిపోయి భక్షకభటులుగా మారిపోయారన్న విమర్శ ఉంది. ముఖ్యంగా ఓ సీఐ అయితే ఓ కార్పొరేటరు కొందరు వైసీపీ నేతలతో కలిసి భారీ ఎత్తున రియల్ ఎస్టేట్ చేసినట్లు చెబుతారు. పేదలను బెదిరించి స్థలాలను లాక్కోవడం, వెంచర్లు వేయడం, బాధితులు స్టేషన్‌కు వెళితే వారితో మీకెందుకు, సెటిల్ చేసుకోండంటూ బాధితులనే బెదిరించారనే ప్రచారం ఉంది. ఆ సార్ పనిచేసిన సర్కిళ్లలో ఆయన వైసీపీకి ఊడిగం చేశారనే పేరుంది. శ్రీనివాసరెడ్డి బ్యాచ్ ఆ సార్‌కు కూడా ల్యాండ్ సెటిల్‌మెంటు చేశారనే చర్చ నడుస్తోంది. హత్య జరిగినప్పుడు విచారణ సమయంలో ఆసారు కీలక పత్రాలతో పాటు సుమారు కోటి రూపాయల నగదు ఇతరత్రా సమాచారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెబుతారు. అవన్నీ రికవరీ చూపించలేదంటారు. హత్య వ్యవహా రంలో వైసీపీ కీలకనేతల హస్తం ఉండడంతోనే ముఖ్యుల పేర్లు తీసేసి రికవరీ వ్యవహారాన్ని పక్కనబెట్టారన్న ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు సీఐడీబృందం ఆ కేసును టేకప్ చేయడంతో ఆ సారు బ్యాచ్ మల్లగుల్లాలు పడుతున్నట్లు చెబుతున్నారు.

కేసు నిగ్గుతేల్చాల్సిందే

కడప నగరం సర్వమతాలకు నిలయం. ఇక్కడ జనం ప్రశాంతత కోరుకుంటారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎక్కడ లేనివిధంగా అరాచకాలు జరిగాయి. కేవలం భూకబ్జాలు, దందాల కోసం నిరుద్యోగులను, చదువు మానేసిన వారిని గుర్తించి సెటిల్‌మెంట్లకు, దౌర్జన్యాలకు తీసుకుపోవడం, వారికి గంజాయి అలవాటు చేయడం ద్వారా.. వీరంటే జనం భయపడే విధంగా ఈ వైసీపీ బ్యాచ్ తయారు చేసిందని చెబుతారు. ఇప్పుడంతా గంజాయి గ్యాంగ్‌లతో నిండిపోయింది. ఈ కేసులో పక్కాగా విచారించి నిందితులను శిక్షించి భూకబ్జాలకు దందాలకు పాల్పడితే భవిష్యత్తు ఇలా ఉంటుందని మెసేజ్ ఇచ్చినట్లు ఉండాలని నగర ప్రజలు కోరుతున్నారు. గ్యాంగ్‌లను అడ్డుపెట్టుకుని పేదల స్థలాలు కొట్టేసి అమాయకుల మాదిరిగా చిరునవ్వు నవ్వుతూ కటింగ్‌లు ఇచ్చే రాజకీయ నాయకుల నిజస్వరూపం జనాలకు అర్థమవుతుంది.

నేర రహిత జిల్లాగా తయారు చేద్దాం

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ కృష్ణారావు

రాయచోటిటౌన్, జూన్ 25: జిల్లాను నేర రహితగా జిల్లాగా తయారు చేసేందుకు పోలీసు అధికారులంతా సమష్టిగా నేరాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ కృష్ణారావు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పోలీసు అధికారులనుద్దేశించి మాట్లాడుతూ కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పురోగతి సాధించి పరిష్కరించాలన్నారు. కోర్టులో స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా కేసుల్లోని నిందితులకు తగిన శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. ప్రధానంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన పలు కేసులు, పీడీ యాక్టు ఇతర అంశాలపై సమీక్షించారు. అలాగే కొత్త చట్టాలపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలో పలు కేసులను సమీక్షించి తీవ్ర నేరాలతో ఉన్న కేసుల దర్యాప్తు వివరాలు, కోర్టులో చార్జిషీట్ దాఖలు, ప్రస్తుతం కోర్టులో ట్రయల్ ఏ దశలో ఉన్నాయి వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోర్టులో స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా కేసుల్లోని నిందితులను తగిన శిక్షపడే విధంగా చూడాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. తీవ్ర నేరాల కేసుల్లోని వారిపై నిరంతర నిఘా ఉంచి యాక్టీవ్‌గా ఉన్న వారిని బైండోవర్ చేయాలని సూచించారు. హత్య, రేప్, పోక్సో, ప్రాపర్టీ, గంజాయి తదితర కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పురోగతి సాధించి పరిష్కరించాలన్నారు. కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీని అందింపుచ్చుకోవాలన్నారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా కేసుల్లో నిందితులకు శిక్షణ పడేలా చూడాలని సూచించారు. తరచుగా దొంగతనాలు, దారి దోపిడీలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలపై ప్రత్యేక దృష్టిపెట్టి అడ్డుకట్ట వేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, డీఎస్పీలు, ఏఆర్‌డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

ఎన్నికల వ్యయ రిజిస్టర్‌లను తప్పనిసరిగా సమర్పించాలి

- ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి నాగరాజు

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 25: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరూ తుది వ్యయ రిజిస్టర్‌లను తప్పనిసరిగా సమర్పించాలని ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, అభ్యర్థుల ప్రతినిధులతో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ సహాయ సహకారాలతో ఎన్నికల వ్యయ పరిశీలన ప్రక్రియ సాఫీగా జరిగిందన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులకు తుది వ్యయ రిజిస్టర్‌లను ఏ విధంగా సమర్పించాలో అభ్యర్థులు, వారి ప్రతినిధులకు వివరించారు. ఎలెక్షన్ సెల్ సూపరింటెండెంట్ నరసింహకుమార్ మాట్లాడుతూ త్వరలో ఎన్నికల వ్యయ పరిశీలకులు జిల్లాకు రానున్న నేపథ్యంలో అభ్యర్థులు తుది వ్యయ రిజిస్టర్‌లను ఎన్నికల వ్యయ పరిశీలకులకు సమర్పించి వారి దగ్గర నుంచి సంబంధిత సర్టిఫికెట్లను పొందాలని తెలిపారు. సమావేశంలో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ప్రతినిధులు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు, పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన వ్యయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కట్టుకున్న భార్యను కడతేర్చిన భర్త

- పత్రవారి పల్లెలో దారుణం

బి.కొత్తకోట, జూన్ 25: జీవితాంతం తోడు వుంటానని బాసలు చేసిన భర్తే కాలయముడై కట్టుకున్న భార్యను కడతేర్చిన సంఘటన మంగళవారం బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పత్రవారి పల్లెలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బి.కొత్తకోట సీఐ సూర్య నారాయణ తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. పత్రవారిపల్లెకు చెందిన అన్నపూర్ణ (35)ను కర్నాటక రాష్ట్రం బాగేపల్లికి చెందిన మల్లికార్జున(40)కి ఇచ్చి వివాహం చేశారు. మల్లికార్జునకు అప్పటికే వివాహమై పిల్లలు వున్నారు. ఒక భార్యను బాగేపల్లిలో, మరో భార్యను కంటేవారిపల్లెలో కొంతకాలం, పత్రవారి పల్లెలో మరికొంత కాలం కాపురం పెట్టి ఇద్దరినీ చూసుకునేవాడు. కొన్ని రోజుల తర్వాత ఇద్దరు భార్యల మధ్య గొడవలు జరిగాయి. అతనికి ఇద్దరినీ భరించడం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో బాగేపల్లిలో వున్న భార్య తన ఇద్దరు పిల్లలతో సహా ఓ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో నిందితుడైన మల్లికార్జునకు జైలుశిక్ష పడింది. ఈ కేసులో ఇటీవలే జైలునుంచి విడుదల అయ్యాడు. అన్నపూర్ణ కారణంగా భార్య పిల్లలు చనిపోయారని, తాను జైలుకు వెళ్లాల్సి వచ్చిందని భావించిన మల్లికార్జున ఆమెను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. పత్రవారి పల్లెకు వచ్చి అన్నపూర్ణతో మంచిగా మాట్లాడి తనతో పాటు తీసుకెళ్లి అక్కడా, ఇక్కడా తిప్పుతూ బాగా నమ్మించాడు. బాగే పల్లిలో కాపురం పెడదామని చెప్పి మదనపల్లెకు తీసుకెళ్లాడు. సోమవారం రాత్రి పొద్దుపోయాక మదనపల్లె నుంచి పత్రవారిపల్లె వస్తూ గ్రామ సమీపంలోని జమాలమ్మ దర్గా వద్దనున్న బీడు భూమిలో గొంతు నులిమి చంపేశాడు. మంగళవారం ఉదయం ఘటన వెలుగు చూసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరు కుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. హతురాలి అన్న రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హత్యకు గురైన అన్నపూర్ణ

'గండికోట'ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు



ప్రాజెక్టు గురించి ట్రైనీ కలెక్టర్లకు వివరిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కొండాపురం, జూన్ 25: ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు మంగళవారం గండికోట ప్రాజెక్టును సందర్శించారు. 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కళ్యాణి(కర్నూలుజిల్లా), హేమవంశీ (చిత్తూరుజిల్లా), జగన్నాథ్(గుంటూరుజిల్లా), వినూత్న(అనంతపురంజిల్లా), భావన (కాకినాడజిల్లా), నోక్‌వాల్(ఎన్టీఆర్ జిల్లా) ట్రైనీ కలెక్టర్‌కు ప్రాజెక్టు గురించి ఇరిగేషన్ అధికారులు వివరించారు. గండికోట సొరంగం, ప్రాజెక్టు ఆయకట్టు, సామర్థ్యం తదితర వివరాలను వీరికి క్షుణ్ణంగా వివరించారు. ఇరిగేషన్ ఎస్ఈ అలియాజ్ బాష, ఈఈ రామునాయక్, డీఈలు ఉమామహేశ్వర్లు,చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడి సేవలో...

ఒంటిమిట్ట, జూన్ 25: ఏకశి లా నగిరి కోదండ రాముడిని ట్రైనీ కలెక్టర్లు మంగళవారం సాయంత్రం దర్శించుకున్నా రు. 2023 ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ ట్రైనింగ్ కలెక్టర్లు ఆరుగురు కోదండ రాముడిని దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడప జిల్లా పర్యటన ముగించుకుని తిరుపతికి వెళుతూ మార్గమధ్యలో ఒంటిమిట్టలో కోదండ రామాలయంలో మూలవిరాట్టు సీతారాములను ట్రైనీ కలెక్టర్లు సీహెచ్ కల్యాణి, హేమవంశీ, స్వప్నిల్ జగన్నాథ్, బోలిపల్లి వినూత్న, హెచ్ఎస్ భావన, శుభం నోక్‌వాల్ దర్శించుకున్నారు. తహశీల్దారు రాము, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ వేధిస్తున్నాడంటూ..

తల్లి, బిడ్డ ఆత్మహత్యాయత్నం



కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న తల్లి, కుమార్తె

కడప (క్రైం), జూన్ 25: ఏఆర్ కానిస్టేబుల్ రామకృష్ణ వేధింపులు తాళలేక శంకరాపురం వాసులు తల్లి దండు శారద, పెద్దకుమార్తె లక్ష్మీ శైలజ మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు గుర్తించి వారిని వైద్య పరీక్షల నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కడప చిన్నచౌకు పరిధి శంకరాపురంలో నివసిస్తున్న శారద చిన్న కూతురు స్వాతి ఏఆర్ కానిస్టేబుల్‌ను కులాంతర వివాహం చేసుకుంది. కానిస్టేబుల్ అయిన తన అల్లుడు తన పెద్ద కుమార్తె సహా తనను, తన కుమారుడిని మానసికంగా వేధిస్తుండడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వారు చెప్పుకొచ్చారు. అధికారులు తమకు న్యాయం చేసి తమ అల్లుడిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

విద్యుత్ షాక్‌తో పొలంలో రైతు మృతి



పెద్ద సుబ్బరాయుడు మృతదేహం

మైలవరం, జూన్ 25: పొలంలో సాగు చేసిన మినుము పంటకు పురుగుల మందు పిచికారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ కాలికి తగిలి పోలు పెద్ద సుబ్బరాయుడు (54) అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలో మంగళవారం చోటుచేసుకున్న సంఘటనపై వివరాల్లోకెళితే రామచంద్రాయపల్లి రైతు పెద్ద సుబ్బరాయుడు తన పొలంలో సాగు చేసిన మినుము పంటకు పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. మొదట ఒక ట్యాంక్ పిచికారీ చేసి మరో ట్యాంక్ పిచికారీ చేసేందుకు వస్తుండగా పొలంలో అక్కడే గట్టుపై ఉన్న మోటారు విద్యుత్ తీగలను గుర్తించక ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ కాలికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి మైలవరం పోలీసులకు, విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని జరిగిన సంఘటనపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. పెద్ద సుబ్బరాయుడుకు భార్య, కుమారుడు, కూమార్తె ఉన్నారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మైలవరం ఎస్ఐ రెడ్డి సురేష్ తెలిపారు.

విద్యుత్ తీగలు పట్టుకుని వ్యక్తి ఆత్మహత్య

గాలివీడు, జూన్25: చీమలచెరువుపల్లి పంచాయతీ కస్పా వాసి యర్రంరెడ్డి (70) విద్యుత్ తీగలు పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... యర్రంరెడ్డికి రెండేళ్ల కిందట భార్య మరణించింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతూ ఉండేవారని తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురవడంతో మానసిక బాధ ఎక్కువై ఆదివారం ఇంటి నుంచి బయటికి వెళ్లాడని తెలిపారు. అప్పటి నుంచి యర్రంరెడ్డి కోసం కుటుంబ సభ్యులు గాలించగా మంగళవారం పల్లెకి సమీపంలోని విద్యుత్ తీగలు చుట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పరిశీలించగా రెండు రోజుల కిందటే మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి యర్రంరెడ్డి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాలుగేళ్ల తరువాత.. కుమారుడి చెంతకు తల్లి



తల్లిని కుమారుడికి అప్పగిస్తున్న సీఐ

ధర్మవరం, జూన్ 25: ఓ తల్లి నాలుగేళ్ల తరువాత కుమారుడి చెంతకు చేరింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం రైల్వే పోలీసు స్టేషన్‌లో కుమారుడు గురుశేఖర్‌కు ఆర్పీఎఫ్ సీఐ బోయకుమార్ అప్పగించారు. అన్నమయ్య జిల్లా గుంటపాల్యం వాసి రెడ్డెమ్మ నాలుగేళ్ల కిందట రైలులో తప్పిపోయింది. అప్పట్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. కాగా సోమవారం తిరుపతి - గుంతకల్లు ప్యాసింజర్ రైలులో రెడ్డెమ్మను గురుశేఖర్ స్నేహితుడు గమనించాడు. వెంటనే గురుశేఖర్‌కు ఫోన్‌చేసి, విషయం తెలిపాడు. గురుశేఖర్ ఆన్‌లైన్‌లో ఫొటో సహా ఆర్పీఎఫ్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఆర్పీఎఫ్ ఏఎస్ఐ వెంకటరావు సిబ్బందితో తిరుపతి ప్యాసింజర్ రైలు ధర్మవరం రైల్వేస్టేషన్‌కు రాగా అందులో ఉన్న రెడ్డెమ్మను ఫొటో ఆధారంగా గుర్తించారు. ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లి, గురుశేఖర్‌కు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం గురుశేఖర్ ధర్మవరం ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. ఆర్పీఎఫ్ సీఐ బోయకుమార్, ఏఎస్ఐ వెంకటరావు రెడ్డెమ్మను కుమారుడు గురుశేఖర్‌కు అప్పగించారు. కుమారుడు ప్రేమ వివాహం చేసుకోవడంతో అలిగి రెడ్డెమ్మ ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు



స్మగ్లర్లు, ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూన్ 25: కడప జిల్లా మల్లేపల్లి అటవీప్రాంతంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి 15 ఎర్రచందనం దుంగలు సహా రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం మంగళవారం కడపజిల్లా మల్లేపల్లి అటవీప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. సమీప ఆటోనగర్ చేరుకునేసరికి కొందరు స్మగ్లర్లు రెండు కార్లలో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. చుట్టుముట్టగా కొందరు పారిపోగా ఆరుగురు స్మగ్లర్లను పట్టుకున్నారు. విచారణలో కడపకు చెందిన యాతగిరి హరి, కొప్పిలి సుధాకర్‌రెడ్డి, తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ప్రభు, రమేష్, రవి, అయ్యప్పన్ మునియన్‌గా గుర్తించారు. వీరినుంచి రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలు, 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఐదుగురు స్మగ్లర్ల కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు.

తీగలాగితే... డొంక కదులుతోంది

చిలమకూరు పంచాయతీ అవినీతిపై అధికారుల విచారణ ● కోట్లలో అవినీతి జరిగిందని ఫిర్యాదులు
ఎంపీటీసీ స్టేట్‌మెంట్ తీసుకున్న అధికారులు ● 2021లో ఫిర్యాదు-2022లో నిలదీత
ఐసీఎల్ విరాళాల్లో కూడా అవినీతే : కూటమి ప్రతినిధులు ● ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన అధికారులు

ఎర్రగుంట్ల, జూన్ 25: చిలంకూరు పంచాయతీ అవినీతిపై తీగలాగితే... డొంక కదులుతోంది. భారీ అవినీతిపై డీపీఓ డి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు నలుగురు అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు. 2021లో ఫిర్యాదు చేయడం, 2022 లో మండల సమావేశంలో నిలదీయడం, పెద్ద ఎత్తున దుమారం రేగడం, ఆంధ్రజ్యోతిలో 'ఆ కోటి రూపాయలకు ఎక్కడ పనిచేశారు' శీర్షికన ప్రత్యేక కథనం కూడా ప్రచురితమైంది. గతంలో ఇక్కడి పంచాయతీలో భారీ అక్రమాలు, అవినీతి జరిగిందని జిల్లా అధికారులకు ఎంపీటీసీ నవీన్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అధికారపార్టీకి చెందిన వారి హస్తం ఉండడంతో అప్పట్లో సరైన విచారణ జరగలేదు. దీనికి తోడు ప్రజాప్రతినిధులు కూడా అధికారులను రాకుండా చేశారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఇక్కడ జరిగిన అవినీతి భాగోతాన్ని వెలికితీసేందుకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టి సారించారు. ఫలితంగా జిల్లా అధికారి విచారణకు ఆదేశించడంతో విచారణ ప్రారంభమైంది. వివరాల్లోకెళితే....

ఎర్రగుంట్ల మండలం చిలమకూరు పంచాయతీలో భారీగా అవినీతి జరిగింది. ఈవిషయమై ఎంపీటీసీ నవీన్‌కుమార్ ఫిర్యాదు చేయడం, బీజేపీ, టీడీపీ నేతలు బాలవెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి దృష్టికి తీసుకెళ్లడంతో డీఎల్‌పీఓలు మస్తాన్‌వల్లి(కడప), భాస్కర్ (జమ్మలమడుగు), ఈఓపీఆర్డీలు షాకీర్‌అలీఖాన్ (రాజుపాలెం), క్రిష్ణ యాదవ్(బి.కోడూరు)తో కూడిన బృందాన్ని డీపీఓ ప్రభా కర్‌రెడ్డి నియమించి ఇక్కడికి విచారణకు పంపారు. పంచాయతీలో వారు మంగళవారం విచారణ చేపట్టారు. అప్పట్లో జరిగిన పనులకు సంబంధించిన ఎం బుక్కులు, రికార్డులు, రసీదులు, వర్క్ ఆర్డర్స్, ఆడిట్ బుక్కులను తనిఖీ చేశారు. పంప్ ఆపరేటర్ రామక్రిష్ణపై భారీ అవినీతి ఆరోపణలు రావడంతో ఆయనతో స్టేట్‌మెంట్ తీసుకున్నారు. నీరు వదిలే వెంకటేష్(స్వీపర్)ను కూడా విచారించారు



డీఎల్‌పీఓతో కూడిన అధికారులకు ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు

● ఫిర్యాదు చేసిన ఎంపీటీసీ నవీన్‌కుమార్‌తో కూడా వారు మాట్లాడారు. 2018 నుంచి 2024 మార్చి 31 వరకు పంచాయతీలో జరిగిన సీసీరోడ్లు, డ్రేనేజీ నిర్మాణాలు, కొత్తగా వేసిన బోర్లు, పైపులైన్లు, నిర్మాణాలు, బ్లీచింగ్ కొనుగోలు, కొత్తమోటార్ల కొనుగోలు, నిరుపయోగమైన సామాన్లు అమ్మితే వచ్చిన డబ్బు ఎంత, ఎలక్ట్రీసిటీ, ఫర్నీచర్ కొనుగోళ్లపై వివరాలు, ఇప్పటి వరకు ఇండియా సిమెంట్స్ చిలమకూరు వారు గ్రామపంచాయతీకి ఇచ్చిన విరాళాలు, ఇతర వస్తువుల పూర్తి వివరాలు ఇవ్వాలని నవీన్ కోరడంతో అతనితో వచ్చిన అధికారులు లిఖితపూర్వక స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఎన్డీయే కూటమి నేతలు బాలవెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డి, సత్యం స్వామి తదితరులు అధికారులకు ఇక్కడ జరిగిన విషయాలపై వివరించారు. అవినీతిపై సత్వరం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. చిలమకూరులో పదేళ్లలో జరిగిన భారీ అవినీతిపై తీగ లాగితే డొంక కదులుతోందని, అన్ని అవినీతి, అక్రమాలు వెలుగు చూస్తాయని ప్రజలు అంటున్నారు.

2022లో విచారణ నివేదిక ఇచ్చాము
డీఎల్‌పీఓ మస్తాన్‌వల్లి

ఇక్కడి ఆరోపణలపై 2022లో కడప డీఎల్‌పీఓగా నేను విచారణ చేసి నివేదిక ఇచ్చాను. అయితే దానిపై ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియడంలేదు. ప్రస్తుతం డీపీఓ ఆదేశాల మేరకు మళ్లీ టీంగా ఇక్కడికి వచ్చాము. ఎంపీటీసీ, కూటమి నేతల ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ చేశాము. ఇండియా సిమెంట్స్ హౌస్‌ట్యాక్స్ కాకుండా, ఇతర వితరణలపై ఆరా తీస్తున్నాము. ఇంజనీరింగ్ పనులపై ఆయా ఇంజనీరింగ్ అధికారులకు తెలిపాము. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్‌తో మాట్లాడాము. ఇటీవల పైప్‌లైన్ వేయలేదన్నారు. పూర్తిస్థాయిలో రిపోర్టు ఇవ్వాలని ఏఈ పీఆర్‌ను ఆదేశించాము. పంప్ ఆపరేటర్‌గా పనిచేయక పోయినా జీతం ఇచ్చిన విషయంపై రిపోర్టు ఇచ్చాము. ఆయనతో పంచాయతీకి సంబంధించిన కాంట్రాక్టు పనులు చేయించారని తెలిసింది. ఎలాంటి రోడ్లు, డ్రైనేజీ, ఇతర కాంట్రాక్టు పనులు ఇవ్వరాదని, చేయించకూడదని నా రిపోర్టులో చెప్పారు. చేసిన పనులపై కూడా విచారిస్తున్నాము. స్వీపర్‌గా పనిచేస్తున్న వెంకటేష్‌ను పంప్ ఆపరేటర్‌గా పనిచేయిస్తూ అతనికి కూడా కాంట్రాక్టు పనులు ఇప్పించారని ఆయన అంగీకరించారన్నారు. దీంతో స్వీపర్ పని చేయకుండా పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు ఆయనతో లిఖితపూర్వక స్టేట్‌మెంట్ తీసుకున్నాము. ఎంపీటీసీ అడిగిన విషయాలన్నింటికీ తాము జవాబు ఇస్తాము. సంబంధిత శాఖాధికారులతో పూర్తి స్థాయిలో రికార్డులు, ఫిజికల్‌గా కూడా చూపించేందుకు ప్రయత్నిస్తాము. ఈ విషయాలన్నింటిపై నివేదికను డీపీఓకు ఇస్తామన్నారు.

వేంపల్లె షరీఫ్ పుస్తకానికి 'విశాలాక్షి' పురస్కారం



వేంపల్లె, జూన్ 25: టీవీ ప్రకటనల్లో భాష అనే పుస్తకాన్ని రచించిన రచయిత, జర్నలిస్టు డాక్టర్ వేంపల్లె షరీఫ్‌కు విశాలాక్షి పురస్కారం లభించింది. విశాలాక్షి పత్రిక 15వ వార్షికోత్సవం సందర్భంగా ఏడువిభాగాల్లో ఉత్తమ పుస్తకాలను ఎంపిక చేసి ఈ పురస్కారం ప్రకటించారు. అందులో పరిశోధన విభాగంలో షరీఫ్ రాసిన పుస్తకం ఎంపికైంది. ఈనెల 30వ తేదీన నెల్లూరులో జరిగే సభలో నగదు బహుమతి, పురస్కార ప్రధానం ఉంటుంది. ఈ మేరకు మంగళవారం రచయితకు నిర్వాహకులు సమాచారం అందించారు. మనకు తెలియకుండానే మనపై ప్రభావం చూపి మన అలవాట్లు, అభిరుచుల్లో మార్పును తెచ్చే శక్తి ప్రకటనలకు ఉందని రచయిత అన్నారు. మన సంస్కృతి, భాషపై ప్రకటనలు ప్రభావం చూపే తీరును ఉదాహరణలతో సహా ఈ పుస్తకంలో వివరించానని తెలిపారు. ఇప్పటికే ఈ పుస్తకం అనేక యూనివర్సిటీల్లో తెలుగు, జర్నలిజం, ఎంబీఏ విద్యార్థులకు రెఫరెన్సు పుస్తకం కింద ఉందని చెప్పారు. ఇపుడు ఈ అవార్డు ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



వెంకటసుబ్బయ్య (ఫైల్‌ఫొటో)

బద్వేలుటౌన్, జూన్ 25: శేఖర్ థియేటర్ ఎదురుగా ఆటో ద్విచక్రవాహనం ఢీ కొన్న సంఘటనలో కోడూరు చిన్న వెంకటసుబ్బయ్య(45) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సురేంద్రనగర్ వాసి చిన్నవెంకటసుబ్బయ్య బార్బర్‌షాపుతో కుటుంబపోషణ చేస్తుండేవాడు. కాగా సోమవారం నెల్లూరు రోడ్డు జాతీయ రహదారిపై ఆటో ఢీ కొనడంతో ద్విచక్రవాహన దారుడు చిన్న వెంకటసుబ్బయ్య కింద పడి తలకు గాయమైంది. దీంతో స్థానికులు హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య భారతి, కుమార్తె సుప్రియ, కుమారులు చరణ్, జశ్వంత్ ఉన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. దీంతో మృతుని కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

సంబేపల్లె, జూన్25: కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని నారాయణరెడ్డిపల్లె పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం ద్విచక్రవాహనం ఢీకొని అచ్చన్న అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.... నారాయణరెడ్డిపల్లె కస్పాకు చెందిన అచ్చెన్న చిల్లర దుకాణంకు వెళ్లి తన ఇంటికి నడుచుకొని వెళుతుండగా రాయచోటి వైపు నుంచి సంబేపల్లె వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అచ్చెన్న నారాయణరెడ్డిగారిపల్లె సచివాలయంలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్నన్నట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108లో రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బేకరి యజమానికి జరిమానా



బేకరిలో తనిఖీ చేస్తున్న దృశ్యం

బద్వేలు, జూన్ 25: స్థానిక సిద్దవటం రోడ్డులోని రాజు బేకరి యజమానికి మంగళవారం మున్సిపల్ అధికారులు రూ.10వేలు జరిమానా విధించారు. సోమవారం ఓ వ్యక్తి తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా బేకరీలో కేక్ కొనుగోలు చేశాడు. ఇంటికెళ్లి తిని చూడగా అది చేదుగా ఉందని పిల్లలు చెప్పారు. దీంతో లోపల మొత్తం బూజు పట్టిందని తెలిసింది. దీనిపై అతను మున్సిపల్ కమిషనర్ కృష్ణకు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు శాని టరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, వార్డు శానిటరీ సెక్రటరీలు బేకరీలో తనిఖీ చేపట్టారు. కమిషనర్ ప్రజలకు పలు సూచనలు ఇస్తూ బేకరీలు, హోటళ్లు, రోడ్లపైన దొరికే ఆహారం విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని, పట్టణంలో డయేరియా కేసులు కూడా పెరుగుతున్నాయని ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నామమాత్రంగా డీఎంహెచ్ఓ విచారణ

పులివెందుల రూరల్, జూన్ 25: అవినీతి వ్యవహారంలో విచారించి చర్యలు తీసుకోవాల్సిన అధికారి లక్షలాది రూపాయలు దండుకుంటున్న ఉద్యోగిని కాపాడేందుకు నామమాత్రంగా విచారణ చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. డీఎంహెచ్ఓ ఉద్యోగిని కాపాడేందుకు ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఫిర్యాదు చేసిన వారిని పూర్తి ఆధారాలు కావాలంటూ వారిని వెనక్కితగ్గేలా ప్రశ్నిస్తూ అవినీతి ఉద్యోగికి అండగా నిలవడంపై వైద్య ఉద్యోగ వర్గాలే విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి హాజరు పట్టిక, ఎఫ్ఆర్ఎస్ లోకేషన్ వివరాలు, పీహెచ్‌సీలో ఉన్న సీసీకెమెరాల ఫుటేజీ, స్థానిక ప్రజలతో మాట్లాడడం ఇలా పలురకాలుగా విచారణ జరగాల్సి ఉంటుంది. అవేమీ జరగకుండా పీహెచ్‌సీ సిబ్బందితో మాత్రమే సంతకాలుచేయించుకుని విచారణ ముగించారు. వైసీపీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్న ఆ ఉద్యోగి ప్రశ్నించే వారికి వైసీపీ పెద్దల నుంచి ఫోన్లు చేయిస్తూ బెదిరిస్తుంటారని స్థానిక ప్రజలు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీలో ఎమ్‌పీహెచ్ఎస్ (ఎఫ్) విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి విధులకు గైర్హాజరవుతూ నిర్లక్ష్యం వహిస్తుండడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా వైద్యాధికారి నాగరాజుతో కూడిన బృందం విచారణ చేపట్టారు. అయితే ఫిర్యాదు దారు ఏ అంశాలపై ఫిర్యాదు చేశారో ఆ అంశాలపై పూర్తి ఆధారాలు ఇవ్వాలని డీఎంహెచ్ఓ అన్నారు. ఆమె గైర్హాజరైన వివరాలు, ఆమె ప్రైవేట్‌గా ఎక్కడ విధులు నిర్వహించేదో, గత ప్రభుత్వంలోని వైసీపీ పెద్దలను అడ్డుపెట్టుకుని విధులకు హాజరవకుండా లక్షల రూపాయల జీతం పొందుతుండేదో తదితర వివరాలతో కూడిన పత్రాలను అందించారు. ఇవి సరిపోవు మరిన్ని ఆధారాలు కావాలని చెప్పడంతో ఫిర్యాదు దారుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. విచారణపై ఆంధ్రజ్యోతి డీఎంహెచ్ఓ నాగరాజుతో మాట్లాడగా పీహెచ్‌సీలో విచారణ చేసి ఆర్‌డీకి నివేదిస్తామని తెలిపారు. విచారణ అంటే అందరి సమక్షంలో జరగాలి కదా అని అడగ్గా తాము చూసుకుంటామని సెలవిచ్చారు.

ప్రశాంతంగా పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు

పరిశీలించిన వీసీ చింతా సుధాకర్



ఇంటర్వ్యూలను పరిశీలిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కడప (ఎడ్యుకేషన్), జూన్ 25: ఏపీ ఆర్ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ రెండో రోజు ప్రశాంతంగా కొనసాగింది. మంగళవారం జరిగిన మేథమేటిక్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. వైవీయూ సహా వివిధ యూనివర్శిటీల సబ్జెక్టు నిపుణులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ రిజిస్ట్రారు ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య ఇంటర్వ్యూలో జరిగే తీరును ఆకస్మికంగా పరిశీలించారు. ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ 26న గణితం, 27న సైకాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

పుల్లంపేట, జూన్ 25: సీతారాజంపేట సమీప పుల్లంగేరు బ్రిడ్జి వద్ద ఓవర్ టేక్ చేయబోతూ లారీ ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. రైల్వేకోడూరుకు చెందిన కూలీలు మామిడి కాయలు కోసి రాజంపేట వైపు వెళుతుండగా పుల్లంపేట వద్ద వెనుక వైపు నుంచి లారీ ఓవర్‌టేక్ చేయబోయి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న కూలీలు ఎగిరి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో రైల్వేకోడూరు రెడ్డివారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన సెనగ జాను, ఆళ్లగడ్డ నియోజకవర్గం మందలూరు వాసి దస్తగిరి గాయపడ్డారు. గాయపడ్డవారిని 108లో రాజంపేట ప్రభుత్వం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పుల్లంపేట ఎస్ఐ రఘురాం తెలిపారు.

పోలీసుల అదుపులో రామచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 25: పోలీసుల అదుపులో హత్యకేసు నిందితుడు రామచంద్రారెడ్డి ఉన్నట్లు విశ్వసనీమ సమాచారం. ఆదివారం రాత్రి యువకుడు మహేశ్వర్‌రెడ్డి హత్య విషయం బహిర్గతమైంది. హత్య చేయడానికి గల కారణాలను తెలుసుకోవడంపై డీఎస్పీ మునిశేఖర్, సీఐలు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మహేశ్వర్‌రెడ్డిని భూమిరెడ్డి రామచంద్రారెడ్డి గొడ్డలితో నరికి హత్య చేసి శరీర బాగాలను ముక్కలు ముక్కలుగా చేశారు. ఆ ఇంట్లో రక్తపు పరకలు ఉండడంతో గమనించిన తల్లి రత్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ క్రమంలో హత్య విషయం బయటపడిన విషయం తెలిసింది. ఈ క్రమంలో కేసు నమోదు చేసిన పోలీసు యంత్రాంగం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లుగా తెలుస్తోంది.

కడప శాస్త్రినగర్‌లో చోరీ

కడప (క్రైం), జూన్ 25: కడప నగరం అక్కాయపల్లెలోని శాస్త్రినగర్‌లో ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు అపహరించారు. శాస్త్రినగర్‌కు చెందిన రాజశేఖర్ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం ఊరికి వెళ్లారు. తిరిగి మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చేలోపు ఇంటితాళాలు పగిలి ఉండడంతో తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోనే బీరువా పగలగొట్టి 12 తులాల బంగారు నగలను దొంగలు అపహరించినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

అతిసారపై అవగాహనలో డీఎంఅండ్ హెచ్ఓ

కడప(కలెక్టరేట్) జూన్ 25: సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం రామరాజు పల్లిలో సీజనల్ వ్యాధులు, స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌పై ప్రజలకు చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అతిసార ప్రబలకుండా ఉండాలంటే కాచి చల్లార్చిన నీరును తాగాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలనీ, నిత్యం వంటల్లో వాడే కూర గాయలు, పండ్లను కడిగిన తరువాతే వాడాలన్నారు. ముఖ్యంగా చేతులు శుభ్రంగా కడుగు కోవడం వల్ల సీజనల్ వ్యాధులను అదుపు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలంఖాన్ పల్లి అర్బన్ ఆరోగ్య కేంద్రం డాక్టర్లు ఉబేదుల్లా, నిఖిత, ఏఎన్ఎంలు, ఆశాలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

నందలూరు, జూన్ 25: సంకష్టహర చతుర్థి సందర్భంగా నాగిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం ఏకవార రుద్రాభిషేకం, సాయంత్రం గణపతి హోమం, లక్ష్మీగణపతి, శ్వేతార్క గణపతి హోమం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ లక్ష్యం

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం

సుండుపల్లె, జూన్ 25: ప్రజా సమస్యల పరిష్కారమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం అని టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంశెట్టిపల్లెలో ఆయనను సన్మానించారు. అనంతరం విద్యుత్ సమస్యలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో సమీపంలోని రైతు పొలానికి వెళ్లి పరిశీలించారు. విద్యుత్ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యర్రపురెడ్డి శివరామిరెడ్డి, గ్రామ మాజీ అధ్యక్షుడు చెన్నంశెట్టిపల్లి రమణ, రామాంజులు, నగేశ్, తోట రవీంద్ర, నాగయ్య, జగిలి వెంకట్రమణ, భాస్కర్, జనసేన నాయకులు రామాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దవటం: కోతకు గురయ్యే భూములను పరిశీలిస్తున్న సుగవాసి బాల సుబ్రమణ్యం

భూములను కోత నుంచి రక్షించండి

సిద్దవటం : మండలంలోని కడపాయపల్లెలో వర్షం కారణంగా కోతకు గురవుతున్న, భూములను మంగళవారం రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ నాయకుడు సుబ్రమణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరద బీభత్సం కారణంగా ప్రతి సంవత్సరం పంట నష్టపోతున్నా ప్రభుత్వం ఎలాంటి పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. సుగవాసి సుబ్రమణ్యం మాట్లాడుతూ పెన్నానది తీర ప్రాంతాల దళితుల భూములకు నష్టపరిహారం అందించే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి మండిపల్లి స్వాగతం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్ 25: కుప్పం పర్యటనలో భాగంగా మంగళవారం కుప్పం నియోజకవర్గానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రాష్ట్ర రవాణా, క్రీడా, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు.

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

● యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. జాబీర్

రాయచోటిటౌన్, జూన్25: నూతనంగా ఉన్నత పాఠశాలలుగా అప్ గ్రేడ్ అయి కొత్త డీడీవో కోడ్‌లు కేటాయించిన జెడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల పీఎఫ్ సొమ్మును వారి వ్యక్తిగత ఖాతాల్లో వెంటనే జమ చేయాలని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. జాబీర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన యూటీఎఫ్ నేతలు రాజారమేశ్, రెడ్డిబసయ్య, శ్రీనివాసులతో కలిసి అన్నమయ్య జిల్లా సహాయ ఖజానా అధికారి ఖాదర్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పలు ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మారుస్తూ ఆయా పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయడంతో పాటు, సదరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీడీవోలుగా అధికారమిస్తూ, రాష్ట్ర ఖజానా శాఖ కొత్త డీడీవో కోడ్‌లను కూడా కేటాయించారన్నారు. 2023 జూన్ నుంచి ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల జీతభత్యాల బిల్లులు చేసే సందర్భంలోనే సదరు ఉపాధ్యాయుల పీఎఫ్ సొమ్మును మినహాయించి, ఆయా వివరాలను సంబంధిత ఖజానాశాఖ ద్వారా జిల్లా పరిషత్ కార్యాలయానికి పంపించారన్నారు. అయితే, ఇంతవరకు ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాల్లో పీఎఫ్ సొమ్ము జమ కాలేదన్నారు. ఈ విషయంపై జిల్లా పరిషత్ సిబ్బందిని అడిగితే కొత్త ఉన్నత పాఠశాలల డీడీవో కోడ్‌లు ఇంతవరకు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, ఈ విషయాన్ని ఖజానా శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలియజేశారన్నారు. గత జూన్ నుంచి వందలాది మంది ఉపాధ్యాయులకు చెందిన పీఎఫ్ సొమ్మును వారి వ్యక్తిగత పీఎఫ్ ఖాతాల్లో జమ అయ్యేటట్లు చూడాలన్నారు. అలాగే సాంకేతికపరమైన సమస్యలను పరిష్కరించి జిల్లా పరిషత్ కార్యాలయ ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయ వివరాలు పొందుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



జిల్లా సహాయ ఖజానా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

మంత్రి నారా లోకేష్‌తో చమర్తి భేటీ



నారా లోకేష్‌తో భేటీ అయిన జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జూన్ 25 : మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌తో రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మంగళవారం భేటీ అయ్యారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యవహారంపై చర్చించారు. అనంతరం ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

వైసీపీ నేతల భూఆక్రమణపై ఆర్‌డీవోకు ఫిర్యాదు



రాజంపేట ఆర్డీవో మోహన్‌రావుకు ఫిర్యాదు చేస్తున్న గన్నే సుబ్బనరసయ్యనాయుడు

రాజంపేట, జూన్ 25 : వైసీపీ నేతల భూ ఆక్రమణలపై విచారణ చేసి ఆ భూముల ను స్వాధీనం చేసుకుని పేదలకు పంచి పెట్టాలని తెలుగుదేశంపార్టీ నాయకులు మంగళవారం రాజంపేట ఆర్డీవోకు ఫిర్యా దు చేశారు. రాజంపేట మండల పార్టీ అ ధ్యక్షుడు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు తదితరులు ఆర్డీవో మోహన్‌రావుకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మండలంలో ని ఆకేపాడు, మందపల్లె, శ్రీరంగరాజపురం గ్రామాల్లోని వందల ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేసి పేదల కడుపు కొట్టారన్నారు. బోయనపల్లె ప్రాంతంలోని అన్నమా చార్య ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అక్ర మంగా ఎన్నో ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని చుట్టూ ప్రహరీగోడ నిర్మించు కుందన్నారు. ఎంతో విలువైన ఈ భూమిని కళాశాల పేరిట ఆక్రమించి వైసీపీ నాయకులు తమ కబంధహస్తాల్లో ఉంచుకున్నారన్నారు. దీనిపై కూడా కలెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై విచారణ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆ భూములను భూమిలేని నిరుపేదలకు పంచి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకుడు మలిశెట్టి సుబ్బరాయుడు, సునీల్, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

దళితమిత్ర సంఘం మహాసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వైపు అంజనేయులు

లక్కిరెడ్డిపల్లె జూన్ 25: దళితమిత్ర సంఘం 7వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయా లని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వైపు రామాంజనేయులు తెలిపారు. మంగళవారం అనంతపురం గ్రామంలో జిల్లా విస్తృత స్థాయి కమిటీ సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగుల సమస్యల కోసం జూలై 21న కడప ప్రెస్‌క్లబ్ హాల్‌లో ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బడుగు బలహీన వర్గాల్లో ఆర్థిక సామాజిక, రాజకీయ చైతన్యం లక్ష్యంతో ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు భూమిలేని దళిత, బడుగు బలహీన వర్గాలవారికి మూడు ఎకరాలు భూపంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామ న్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఎస్సీ కార్పొరేషన్‌ద్వారా ఇచ్చిన భూములకు ఏడాదికి ఒకసారి రెన్యువల్ చేసుకోకుండా శాశ్వ తంగా పట్టాలు ఇవ్వాలని ఆయన కోరారు. అర్హులైన పేదలకు 75 శాతం సబ్సిడీతో రూ.20 లక్షల వరకు ష్యూరిటీ లేకుండా బ్యాంక్ రుణాలు ఇవ్వాలని కోరారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలను డిగ్రీ, పీజీ స్థాయికి పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శంకరన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబులేసు, మహిళా అధ్యక్షురాలు బుజ్జమ్మ, మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, సంఘం నాయకులు కేశవ, మల్లేష్, రామమోహన్, భాస్కర్, అంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం



ఆశ వర్కర్లకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఒంటిమిట్ట, జూన్ 25: ఆశవర్కర్ల సమస్యల కోసం పోరాటం కొన సాగిస్తామని సీఐటీయూ జిల్లా కన్వీనర్ గుంటి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని ఆశవర్కర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రజలకు సేవలందిస్తున్న ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. సమాన పనికి సమాన వేతనం కింద ఆశ వర్కర్లకు జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లు సుబ్బలక్షుమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సుండుపల్లె, జూన్ 25: మండల కేంద్రంలో దుస్థితికి చేరిన రోడ్లపై ఆంధ్రజ్యోతిలో "ఆదమరిస్తే అంతే సంగతులు" శీర్షికతో ప్రచురితమైన కథనానికి సుండుపల్లె పంచాయతీ కార్యదర్శి సురేశ్‌బాబు స్పందించారు. రోడ్లపై నీటి తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్ సహకారంతో మురుగునీరు రోడ్లపైకి వదులుతున్న గ్రామస్తులను హెచ్చరించారు. అనంతరం పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు తొలగించారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ అవార్డులు



విద్యార్థులకు పురస్కారాన్ని అందజేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా

రాజంపేట, జూన్ 25 : రాజంపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిభ అవార్డులను అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, జాతీయ ఉపాధ్యాయ గ్రహీత వేణుగోపాల్ నాయుడు, సంస్థ కోకన్వీనర్ పీసీఎన్ మూర్తి తదితరుల ఆధ్వర్యంలో మండలంలోని 8 ఉన్నత పాఠశాలల్లోని 12 మంది విద్యార్థులకు ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రంతో పాటు వెయ్యి రూపాయలు నగదు పారితోషికాన్ని అందజేశారు.

మంత్రులను కలిసిన వీరబల్లి సొసైటీ ప్రెసిడెంట్



నారా లోకేశ్‌తో రాంమోహన్‌రెడ్డి

వీరబల్లి, జూన్ 25: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌బాబును మంగళవారం వీరబల్లి టీడీపీ నేత, సొసైటీ ప్రెసిడెంట్ కల్లూరి రాంమోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖల మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియ జేశారు.

మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కలిసిన అమావాస్య రెడ్డెయ్య



మంత్రి గుమ్మడి సంధ్యారాణితో అమావాస్య రెడ్డెయ్య తదితరులు

రాయచోటిటౌన్, జూన్ 25: ఆంధ్రప్రదేశ్ స్త్రీ సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మడి సంధ్యారాణిని మంగళవారం జిల్లా టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు అమావాస్య రెడ్డెయ్య కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఉన్న ఎస్టీ సామాజిక వర్గం స్థితిగతులను ఆమెకు వివరించారు. న్యాయం చేయాలని ఆమెను కోరారు. గిరిజన నాయకులు మనోహర్‌నాయక్, మొగిలి శ్రీని వాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం

పెనగలూరు, జూన్ 25 : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వసంతోత్సవం నిర్వహించారు. గ్రామంలోని పోలిశెట్టి వంశస్థులు, ఆలయ ధర్మకర్త జిలకర సుబ్బయ్య ఆధ్వర్యంలో యువకులు, విద్యార్థులు, చిన్నారులు సైతం వసంతోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేతంగా వేణుగోపాలుడు ఎలాంటి అలంకరణ లేకుండా నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన అలకలదోపు కార్యక్రమం ఆకట్టుకుంది. సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట, జూన్ 25 : పర్వతవర్ధిని దేవి శాంతిలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వసంతోత్సవం నిర్వహించారు. శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు వసంతాలు చల్లుకున్నారు.

ముగిసిన యల్లమ్మ తిరుణాల

సుండుపల్లె, జూన్ 25: మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంశెట్టిపల్లె సమీపంలో నిర్వహిస్తున్న యల్లమ్మ జాతర మంగళవారంతో ముగిసింది. గ్రామస్తులు సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. మంగళవారం ఉదయం గ్రామస్తులు బోనాలు సమర్పించారు. మండల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. చాందినీ బండ్లు ప్రజలను అలరించాయి.




ఆలయం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న చాందినీ బండ్లు, ప్రత్యేక అలంకరణలో యల్లమ్మ తల్లి

కోదండ రామాలయంలో రామాయణంపై ప్రవచనం

ఒంటిమిట్ట, జూన్ 25 : రామాయణం మానవుడికి విలువలను, సమాజంలోని మంచిని నేర్పుతోందని కాశీ వాస్తవ్యులు రామాయణం ప్రవచనకర్త దెందులూరి వెంకటప్ప నారాయణ సోమాజీ అన్నారు. మంగళవారం కోదండ రామాలయంలో ఆదికవి వాల్మీకి రామాయణంపై ప్రవచించారు. మూడు రోజులు పాటు రామాయణ ఘట్టాలను ప్రజలకు వివరించారు. ధర్మానికి ప్రతీక శ్రీరామచంద్రుడని, అరణ్యవాసంలో నిగ్రహం, ధర్మం, విలువలను తెలియజేశారని అన్నారు. సీతా రాములు అన్యోన్య దాంపత్యానికి ప్రతీక అన్నారు. రామా యణం చదివినా, విన్నా సత్ప్రవర్తనతోపాటు, దానం, శ్వచం, త్యాగం, క్షమాపణ వంటి మంచి అలవాట్లు కలుగుతాయని భక్తులకు సందేశం అందించారు.





హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ - అనంతపురం ఇన్‌చార్జి డీఐజీ షెముషి - ఎస్పీ మణికంఠ

సీఎం నేటి షెడ్యూల్ ఇలా..

ఉదయం 10.30 గంటలు : ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ప్రజలనుంచి వినతుల స్వీకరణ
మధ్యాహ్నం 12.00 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కుప్పం నియోజకవర్గ అధికారులతో సమీక్ష
2.35 : పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో టీడీపీ నియోజకవర్గ సమావేశం
సాయంత్రం 4.10 : పీఈఎస్ వైద్య కళాశాల హెలిప్యాడ్‌నుంచి బెంగళూరుకు పయనం

'అమరావతి'కి విరాళాలు

రాజధాని అమరావతి అభివృద్ధికి మహిళా సంఘాల తరఫున రూ.4.5కోట్ల విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేశారు. టీడీపీ రామకుప్పం మండల శాఖ తరఫున పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి రూ.5 లక్షలు, కుప్పం రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ రూ.లక్ష చెక్కులు అందించారు.

కుప్పం రుణం తీర్చుకుంటా

మండలాలుగా మల్లానూరు, రాళ్లబూదుగూరు ● ఏడాదిలో హంద్రీనీవా జలాలు ● పాలారునదిపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం
● ఉద్యాన పంటల మార్కెటింగ్ కార్గో విమానాశ్రయం ● ద్రావిడ వర్సిటీ ప్రక్షాళన చేస్తా ● సీఎం చంద్రబాబు వరాల జల్లు

కుప్పం, జూన్ 25: తనను ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి, నాలుగుసార్లు సీఎం కావడానికి అవకాశం ఇచ్చిన కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట మంగళవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

రైతుల కోసం..

కుప్పంలో వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పువ్వులు విస్తారంగా పండుతాయి. వీటి మార్కెటింగ్ కోసం కార్గో విమానాశ్రయాన్ని స్థాపించి, బెంగళూరు, కృష్ణగిరి, చెన్నై, కేజీఎఫ్‌తోపాటు విదేశాలకు ఎగుమతి చేసి రైతులు లాభాలు గడించేలా చర్యలు తీసుకుంటా. కుప్పం మార్కెట్ యార్డులో సగంలో ఆగిపోయిన కోల్డ్ స్టోరేజీ భవనాన్ని పూర్తి చేస్తా. అన్ని మండల కేంద్రాల్లోనూ మినీ కోల్డ్ స్టోరేజీ భవనాలను నిర్మిస్తా. పట్టు, వ్యవసాయ పరిశ్రమలకు అవసరమైన సబ్సిడీలు, ప్రయోజనాలు అందిస్తా. తద్వారా రైతులు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటా.

సాగునీటికి ప్రాధాన్యం

నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వి.కోట దాకా హంద్రీనీవా జలాలు తీసుకొచ్చా. ఎన్నికల ముందు జగన్ వచ్చి సినిమా సెట్టింగ్ వేసి డ్రామా చేసేసి వెళ్లారు. నేను 80 శాతం పని పూర్తి చేస్తే మిగిలిన 20 శాతం పని కూడా చేయలేదు. నేను కచ్చితంగా కాలువ నిర్మాణం పూర్తి చేసి కృష్ణా జలాలను ఏడాదిలోగా తీసుకొస్తాను. అన్ని చెరువులను నింపుతాను. సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తాను. ఇక, మనం అధికారంలో ఉన్న సమయంలో పాలారు నదిపై చెక్ డ్యామ్‌లు నిర్మించాం. ఇప్పుడు మళ్లీ వీలైనన్ని చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తా. గుడుపల్లె మండలం యామనూరు, శాంతిపురం మండలం ప్రీతిచామనూరు గ్రామాల సమీపంలో ప్రతిపాదిత రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి వీలైనంత త్వరలో పూర్తి చేస్తాను.

మళ్లీ కడా

ఈ ఐదేళ్లుగా కుప్పంపై జగన్ కక్షగట్టాడు. విధ్వంసం సృష్టించాడు. మళ్లీ సరిచేస్తా. ఈ పతనానికి కారణమైన అందరి లెక్కలు తేలుస్తా. మళ్లీ కడా (కుప్పం పట్టణాభివృద్ధి సంస్థ)ను ఏర్పాటు చేసి నాలుగు మండలాల్లో అభివృద్ధి పనులు చేపడతా. ప్రతి మండల కేంద్రాన్ని రూ.10 కోట్లతో గ్రీన్ టౌన్‌గా అభివృద్ధి చేస్తా. పంచాయతీల స్థాయిని బట్టి రూ.కోటి నుంచి రూ.2 కోట్లతో పనులు చేపడతా. మల్లానూరు, రాళ్లబూదుగూరును కూడా మండలాలుగా చేస్తా.



శాంతిపురం మండలం కడపల్లె వద్ద తన ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు నాయుడు

యువత కోసం..

కుప్పంలో ఎక్కువగా పండే టమోటాకు అనుబంధంగా కెచప్, జ్యూస్ పరిశ్రమలను నెలకొల్పుతా. టెక్స్‌టైల్స్, సాఫ్ట్‌వేర్ కంపెనీల ఫ్రాంచైజీల స్థాపనకు చర్యలు తీసుకుని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా.

ద్రావిడ వర్సిటీని గాడిలో పెడతా

ఈ ఐదేళ్లలో ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని భ్రష్టు పట్టించారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి విధ్వంసం చేశారు. దాన్ని గాడిలో పెడతాను. 254 మంది సిబ్బంది 10 నెలలుగా వేతనాలు లేకుండా ఇబ్బంది పడుతున్నారు. వారందరికి వెంటనే జీతాలు రిలీజ్ చేస్తాను.

రౌడీలకు హెచ్చరిక

కుప్పంలో ఎవరైనా రౌడీయిజాన్ని చేయాలని చూస్తే అదే వాళ్లకు చివరి రోజు అవుతుంది. ప్రశాంతంగా ఉన్న కుప్పంలో అలజడి సృష్టిస్తే సహించేది లేదు. రామకుప్పంలో గంజాయి సాగు అధికమైంది. కుప్పాన్ని గంజాయి స్మగ్లింగ్ కేంద్రంగా మార్చేశారు. దీనిని గంజాయి రహిత నియోజకవర్గంగా తయారు చేస్తా.

ఇంకా ఏం చేస్తానంటే..

- ఎక్కడికక్కడ ఆగిపోయిన వివిధ కులాలకు చెందిన కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తా. సభలు, సమావేశాలు, పెళ్లిళ్లు, పేరంటాళ్లకు అనువుగా తీర్చిదిద్దుతా.
- ఆర్టీసీ డిపోకు ఇంకా అవసరమైన బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు, ఏసీ బస్సులు తెస్తాను. అత్యాధునిక సౌకర్యాలతో మోడల్ డిపోగా తీర్చిదిద్దుతాను.
- కుప్పం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు పూర్తి చేస్తా. రింగ్ రోడ్డు నుంచి పల్లెలను కలుపుకుంటూ తమిళనాడు కృష్ణగిరి, కర్ణాటక కేజీఎఫ్‌లను అనుసంధానం చేస్తా. బెంగళూరునుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్ హైవేకి లింకేజ్ పెట్టి, కుప్పంనుంచే ఇటు బెంగళూరు, అటు చెన్నైకి గంటలో చేరేలా చర్యలు చేపడతా.
- కుప్పం మండలంలోని బేటరాయస్వామి కొండ, గుడుపల్లె మండలం మల్లప్పకొండ, యామగానిపల్లె ధర్మరాజుల దేవాలయం, శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు కోదండరామస్వామి దేవాలయంతో పాటు పల్లెల్లోని మరో 100-150 ఆలయాలను అభివృద్ధి చేస్తా.
- ఈ అయిదేళ్లలో మూలనపడ్డ ఎన్టీఆర్ సుజల ప్లాంట్లను మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకొస్తాను. నియోజకవర్గ ప్రజలకు శుద్ధ జలం అందిస్తా.

మీ తీరువల్లే..

● టీడీపీ సమన్వయ కమిటీ భేటీలో చంద్రబాబు అసహనం

కుప్పం, జూన్ 25: పనిచేసే వాళ్లను పక్కనపెట్టి, షో చేసేవాళ్లను ముందుకు తోయడం వల్లే మొన్న ఎన్నికల్లో మెజారిటీ తగ్గిందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నేతలపై అసహనం వ్యక్తం చేశారు. కుప్పంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంగళవారం సాయంత్రం ఆయన నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీతో సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఎన్నికల్లో తనకు లభించిన 48 వేల ఓట్ల మెజారిటీపై చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాష్ట్రమంతటా ఒక ప్రభంజనంలా టీడీపీకి ఓట్లు పడి, అత్యధిక ఓట్లతోపాటు, సీట్లతో అధికారంలోకి రావడం.. చాలాచోట్ల 80 వేల నుంచి 95 వేల మెజారిటీలు వచ్చాయని గుర్తు చేశారు. పదేపదే చెబుతున్నా, టీమ్‌ను మార్చినా మెజారిటీ ఎందుకు పెరగలేదని నాయకులను నిలదీశారు. ప్రజలతో మమేకం కావాల్సినంతగా కాలేదని, క్షేత్రస్థాయి పరిస్థితులను బేరీజువేసి పనిచేసేవారెవరో, చేయని వారెవరో నిర్ధారించుకోవడంలో తప్పటడుగులు పడ్డాయని అన్నారు. ఇదే తీరుతో వ్యవహరిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక మీదటైనా కష్టపడేవారిని గుర్తించి బాధ్యతలు అప్పగించాలని, ఆ పని తానే చేస్తానని అన్నారు. ఎక్కడా పొరబాట్లు జరగకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా పర్యవేక్షించాలని పార్టీ శ్రేణులకు జాగ్రత్తలు చెప్పారు. కొందరు మండల అధ్యక్షులు, నాయకులు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

హంద్రీ- నీవా కాలువ సందర్శన

శాంతిపురం, జూన్ 25: శాంతిపురం మండలం జల్లిగానిపల్లె, చిన్నారిదొడ్డి గ్రామాల సమీపంలోని హంద్రీ నీవా కాలువను మంగళవారం సీఎం చంద్రబాబు పరిశీలించారు. అక్కడే అధికారులతో సమీక్షించారు. ఈ కాలువ వద్ద సుమారు 30 నిమిషాలు గడిపారు. వెంట అధికారులు మాత్రమే ఉన్నారు తప్ప, పార్టీ నాయకులు లేరు.

సీఎం దృష్టికి 'వి.కోట బైపాస్'

● తూర్పు వైపు రోడ్డు వేయిస్తామని చంద్రబాబు హామీ

వి.కోట, జూన్ 25: కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు దృష్టికి వి.కోట బైపాస్ అంశాన్ని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు తీసుకెళ్లారు. టీడీపీ హయంలో తూర్పు వైపున రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపితే గత వైసీపీ ప్రభుత్వం కర్ణాటక మీదుగా ప్రతిపాదించిందని వివరించారు. రైతులు హైకోర్టును ఆశ్రయించగా.. కర్ణాటక, ఇటు ప్రాంతాల్లో జరుగుతున్న భూసేకరణ పనులు ఆపాలని కోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. వి.కోట అభివృద్ధి దృష్ట్యా తూర్పు వైపునే బైపాస్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని సీఎం వారికి హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, నేతలు సోమశేఖర్, శబరీష్, షేక్‌ఉమ్మర్, విశ్వనాథ్, జనార్దన్‌రెడ్డి, రమేష్, రామూర్తిఆచ్చారి, భక్షా, షణ్ముగం, గుణశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సీఎంతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్




హెలిప్యాడ్ వద్ద మాజీ ఎమ్మెల్సీ గౌనివారిని అడ్డుకున్న రోప్‌పార్టీ పోలీసులు - హెలిప్యాడ్‌లోకి అనుమతులు లేవనడంతో వేచి ఉన్న మాజీ ఎమ్మెల్యే సీకే బాబు

పోలీసుల అత్యుత్సాహం

● టీడీపీ శ్రేణులను అడ్డుకున్న బలగాలు



హెలిప్యాడ్‌లోకి దూకి వెళుతున్న యువకులను బయటకు లాగేస్తున్న పోలీసులు

కుప్పం/వి.కోట, జూన్ 25: చంద్రబాబు పర్యటనలో పోలీసులు అత్యుత్సాహం కనబరిచారు. పీఈఎస్ ఆస్పత్రిలోని హెలిప్యాడ్ వద్దకు వెళుతున్న టీడీపీ నేతలను అడ్డుకోవడంతో వారు అసహనం వ్యక్తం చేశారు. తనకు పాస్ ఉందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు చూపినా రోప్‌పార్టీ అడ్డుకుంది. దీన్ని గమనించిన ఏఎస్పీ రోప్‌పార్టీని వారించి ఆయన్ను లోపలు పంపారు. చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు తదితర పేర్లు జాబితాలో లేవని ఆపేశారు. అదే సమయంలో అటు వచ్చిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయన్ను లోపలకు తీసుకెళ్లారు. శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం, కుప్పం మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులను, నియోజక వర్గ తెలుగు మహిళలనూ అనుమతించక పోవడంతో వారు వాగ్వాదానికి దిగి కన్నీళ్లపర్యంతమయ్యారు. చంద్రబాబు వచ్చేటప్పటికి ఇద్దరు యువకులు ప్రహరీ దూకి హెలిప్యాడ్ వద్దకు పరుగులు తీయగా పోలీసు సిబ్బంది వెంటపడి బయటకు పంపేశారు. తన పర్యటనలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది పెట్టొద్దని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినా, కుప్పంలో మాత్రం పట్టణంలోకి వెళ్ళి, వచ్చే మార్గాలను పోలీసులు మూసేయడం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వినాయకంకు ఘన నివాళులు



పూతలపట్టు, జూన్ 25: వరదల్లో చిక్కుకున్న పలువురిని కాపాడేందుకు వెళ్లి మృతి చెందిన మిలటరీ ఉద్యోగి వినాయకంకు ఐటీబీపీ అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు. పూతలపట్టు మండలం చిన్నబండపల్లెకు చెందిన వినాయకం(32) ఐటీబీపీలో ఉద్యోగం చేస్తూ 2023 జూన్ 25న ఉత్తరాఖండ్‌లో వరదలు రాగా భక్తులను రక్షించేందుకు హెలికాప్టరులో వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ సంఘటన జరిగి ఏడాదైన సందర్భంగా మంగళవారం ఐటీబీపీ కమాండర్ అమిత్ బాటే ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టరు వైవీరెడ్డి, సిబ్బంది చిన్నబండపల్లెకు చేరుకుని వినాయకం స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు.

అపోలో వర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు

చిత్తూరు రూరల్, జూన్ 25: చిత్తూరులోని అపోలో యూనివర్సిటీకి స్విట్జర్లాండ్, జెనీవాలోని అంతర్జాతీయ మెడికల్ ఇన్ఫర్మాటిక్స్ అసోసియేషన్ గుర్తింపు లభించిందని సంస్థ వైస్ ఛాన్సలర్ వినోద్ భట్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో విద్యార్థులకు వైద్య, సాంకేతిక రంగాలలో అంతర్జాతీయంగా వివిధ ప్రాజెక్టులు చేయడానికి అవకాశం లభిస్తుందన్నారు. వైద్యరంగంలో కృత్రిమ మేధస్సు, వైద్య సమాచారాలను విశ్లేషించుకోవచ్చన్నారు. అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ పోతురాజు, ప్రొఫెసర్ సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన లారీ

25 గొర్రెలు, పొట్టేళ్లు మృతి ● పరారైన లారీని పట్టుకున్న ఆర్టీసీ డ్రైవర్

కల్లూరు, జూన్ 25: పులిచెర్ల మండలం కల్లూరు ఘాట్‌రోడ్డులో మంగళవారం సాయంత్రం గొర్రెల మందపైకి లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో 25 గొర్రెలు, పొట్టేళ్లు మృతిచెందాయి. కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కలకడ మండలం గుడిబండ పాపిగారిపల్లికి చెందిన గొర్రెల యజమానులు ఆనంద, వెంకటేష్, గుణశేఖర్, వెంకటశివ తదితరులు స్వగ్రామం నుంచి నెల క్రితం సుమారు 1000 గొర్రెలను మేత కోసం పూతలపట్టు, పాకాల మండలాలకు తోలుకొచ్చారు. మంగళవారం సాయంత్రం గొర్రెలను మేపుతూ కల్లూరు ఘాట్‌రోడ్డులో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఆ సమయంలో కడప నుంచి రాణిపేటకు సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని అదుపుతప్పి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. దీనిని గమనించిన గొర్రెల యజమానులు తప్పించుకున్నారు. అయితే 25 గొర్రెలు, పొట్టేళ్లు చనిపోయాయి. పలు గొర్రెలకు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ ఆగకుండా వెళ్లిపోగా.. బస్సు డ్రైవర్ దామోదర్ బస్సు దిగి ఓ ద్విచక్ర వాహనంలో లారీని వెంబడించి దామల చెరువు వద్ద పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను మరో ఆర్టీసీ బస్సులో కల్లూరు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన గొర్రెలు, పొట్టేళ్లు

చిన్నబండపల్లిలో 30 మందికి అస్వస్థత

● అంగన్వాడీ సెంటర్‌లోనే వైద్యసేవలు



చికిత్స పొందుతున్న బాధితులు

పూతలపట్టు, జూన్ 25: ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 30 మందికిపైగా అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. పూతలపట్టు మండలం చిన్నబండపల్లిలో 200 కుటుంబాలకు పైగా ఉన్నాయి. చెరువులోని తాగునీటి బోరు నుంచి నీళ్ల సరఫరా అవుతాయి. రెండ్రోజుల క్రితం ఏమైందో గానీ పలువురికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వైద్యాధికారులు గ్రామానికి రాకుండానే ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లచే వైద్యసేవలు అందించారు. బాధితులను వైద్యసిబ్బంది అంగన్‌వాడీ సెంటర్‌కు తీసుకొచ్చి వైద్యసేవలు అందించడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. కాగా, బాధితుల్లో మౌనిక అనే గర్భిణి సీఎంసీలో.. భూపతి అనే వృద్ధుడు తిరుపతి రుయాలో.. పరిపూర్ణ అనే మహిళ చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు ఏమాత్రం స్పందించలేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

స్వర్ణ రథంపై వరసిద్ధుడు

● వైభవంగా సంకటహర గణపతి వ్రతం



స్వర్ణ రథంపై ఊరేగుతున్న వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), జూన్ 25: కాణిపాకంలో మంగళవారం ఉదయం సంకటహర గణపతి వ్రతాన్ని అధికారులు వైభవంగా నిర్వహించారు. సిద్ధి, బుద్ధి సమేత స్వామి వారి ఉత్సవర్లను ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. అనంతరం భక్తుల ఆధ్వర్యంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను స్వర్ణరథంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



పాకాల, జూన్ 25: ఉన్నత చదువు చదివి ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాకాల అదనపు ఎస్ఐ లోకేష్ కుమార్ తెలిపిన ప్రకారం.. సదుంలోని వాల్మీకి వీధికి చెందిన ఎం.కృష్ణయ్య కుమారుడు వెంకటరమణ (24) రెండేళ్ల క్రితం ఏజీబీఎస్సీ పూర్తిచేశాడు. అప్పటినుంచి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఉద్యోగం కోసం వెళ్లొస్తానని బైకుపై వెళ్లాడు. పాకాల మండలం కొమ్మిరెడ్డిగారిపల్లె-వెంకట్రామాపురం మార్గంలోని పల్లివేడు క్రాస్‌రోడ్డు సమీపంలోని మామిడితోటలో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం మామిడితోట యజమాని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఉద్యోగం రాలేదనే వేదనతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం చంద్రబాబునాయుడును కలిసిన నేతలు



సీఎం చంద్రబాబునాయుడుకు వెంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేస్తున్న మండల టీడీపీ కన్వీనర్ జిట్టా వెంకటరమణ

పెద్దమండ్యం, జూన్ 25: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగవ సారి బాధ్యతలు చేపట్టి కుప్పంకు విచ్చేసిన సీఎం నారా చంద్రబాబునాయుడు ను కూటమి నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికలలో కూటమి ఘన విజయం సాధించి ముఖ్యమంత్రి హోదాలో కుప్పంకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును బెంగుళూరు విమానాశ్రయమంలో పెద్దమండ్యం మండల టీడీపీ కన్వీనర్ జిట్టా వెంకటరమణ, కూటమి నేతలు కలసి పుష్పగుచ్చాలు ఇచ్చి దుశ్శాలువలతో సన్మానించి వెంకటేశ్వరస్వామి ప్రతిమ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రికి రాష్ట్ర కూటమి నేతలతో పాటు జిల్లా కూటమి నేతలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. తంబళ్లపల్లి సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తీరు వివరించారు. కార్యక్రమంలో టి.సదుం మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

నగరపంచాయతీలో రీజనల్ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ



నగరపంచాయతీ కార్యాలయంలో కమిషనర్, ఉద్యోగులతో మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్ మూర్తి

బి.కొత్తకోట, జూన్25: బి.కొత్తకోట నగరపంచాయతీ కార్యాలయాన్ని అనంతపురం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ పీవీవీయస్ మూర్తి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయ లావాదేవీలకు సంబంధించిన ప్రధాన రికార్డులను పరిశీలించారు. నగరపంచాయతీ ఆదాయ, వ్యయాలపై ఆరాతీ శారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా విషయంలో ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. నగరపంచాయతీ ఆదాయం ఏడాదికి రూ 1.10కోట్లు కాగా, సిబ్బంది జీతాలకే రూ.1.40 కోట్లు చెల్లించాల్సి వస్తోందని, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నిధుల కొరత ఉందని, నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని కమిషనర్ మనోహర్ ఆయనకు వివరించారు. దీనిపై ఆర్‌డీ మాట్లాడుతూ లేఅవుట్‌ల విషయంలో కఠినంగా వ్యవహరిందం తో పాటు, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ట్యాక్స్‌లను వసూలు చేసి ఆదాయ మార్గాలను పెంచుకోవాలని సూచించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల వేలం ద్వారా రూ.9.81లక్షల ఆదాయం

మదనపల్లె టౌన్, జూన్ 25: మదనపల్లె ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో నాటుసారా, కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.9.81లక్షల ఆదాయం వచ్చింది. మంగళవారం స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద జిల్లా ఎస్‌ఈబీ ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్(ఈఎస్) శ్రీనివాస్ సమక్షంలో ఎస్‌ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎస్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పట్టుబడ్డ 59 వాహనాలను బహిరంగ వేలం నిర్వహించగా, అందులో 54 వాహనాలను పాటదారులు కొనుగోలు చేశారన్నారు. మొత్తం మీద 59 వాహనాలకు రూ.5,87,900 అప్‌సెట్ ధర నిర్ణయించి వేలంపాడగా పాటదారులు పోటీ పడి వేలంలో వాహనాలు కొనుగోలు చేశారన్నారు. 54 వాహనాలు విక్రయించగా రూ.9.81లక్షలు వచ్చిందన్నారు. జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలు, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై దృష్టి పెట్టామన్నారు. దీంతో పాటు కర్ణాటక సరిహద్దులోని చెక్‌పోస్టుల్లో నిఘా పెంచామని కర్ణాటక మద్యం అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఎస్‌ఐలు వీజీ రాముడు, హేమకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కురబలకోట, జూన్ 25: రక్తదానం ప్రాణదానంతో సమానమని మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. మంగళవారం మిట్స్ కళాశాలలో తిరుపతికి చెందిన ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంక్ కేంద్రం వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం అలవర్చుకోవాలన్నారు. రక్తదానం చేయడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయనే భావన తొలగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 100 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ జ్యోష్న చౌదరి, చెన్నయ్య, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాథమిక విద్యను కాపాడండి

●జీవో 117ను వెంటనే రద్దు చేయాలి ● తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ స్కూళ్లకే పరిమితం చేయాలి ●ఎస్టీయూ డిమాండ్

మదనపల్లె అర్బన్, జూన్ 25: ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగాన్ని కాపాడాలని ఎస్టీయూ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన ప్రభుత్వాన్ని కోరారు. మదనపల్లె ఎస్టీయూ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన జీవో నెంబరు 117ను వెంటనే రద్దు చేయాలని ఆయన మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వినతిపత్రం ద్వారా విన్నవించారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేయడంతోపాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విలీనం రద్దు చేసి 1-5 వతరగతి వరకు పాత పద్ధతిలో కొనసాగేవిధంగా చర్యలు చేప ట్టాని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని, తద్వారా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటుగా తెలుగు, ఉర్దూ మాధ్యమాలను కొనసాగించా లన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ వీలైనంతవరకు వేగంగా కోర్టు కేసులకు ఆస్కారం లేకుండా మెగా డీఎస్సీలో నియామకాలు చేపట్టాని కోరారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, అవసరం లేని యాపులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను ఎస్టీయూ నాయకులు గజమాలలతో ఘ నంగా సన్మానిం చారు. కార్యక్రమంలో గంటామోహన్, పోకల మధు సూదన్, కడియాల మురళి, రాజారెడ్డి, నరసింహులు, ఆర్‌వి రమణ, శేఖర్‌రెడ్డి, రమేష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మీపతి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు



మదనపల్లె జోస్ అలుకాస్ జ్యువెలరీ షాపులో బ్రహ్మాండమైన ఆఫర్‌లు ప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు. బంగారు ఆభరణాల కొనుగోలుపై తరుగు చార్జీలు 50శాతం తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే వజ్రాలపై 20శాతం, ప్లాటినంపై 7శాతం కొనుగోలుపై తగ్గింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా బోయకొండ గంగమ్మ ఉత్సవాలు



బోనాలు మోసుకెళ్తున్న మహిళలు

ములకలచెరువు, జూన్ 25: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా వెలిసిన బోయకొండ గంగమ్మ అమ్మవారి జాతర ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా బోనాలు మోసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకము, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నడివీధి గంగమ్మ జాతర

మదనపల్లె అర్బన్, జూన్25: పట్టణంలోని నడివీధి గంగమ్మ జాతరను మంగళవారం వైభవ ంగా నిర్వహించారు. పట్టణంలోని మహిళలు దీలు, బోనాలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. చీర, జాకెట్లు, పసుపు, కుంకుమలతో మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో పట్టణంలోని నెహ్రూబజార్, త్యాగరాజవీధి, గుండ్లూరువీధి, కమ్మవీధి, అప్పారావుతోట, సిపాయివీధి, ఆర్‌ఆర్ వీధి జాతర సందడి నెలకొంది.

మొక్కు తీర్చుకున్న వలసపల్లె టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, జూన్ 25: రాష్ట్రంలో చంద్రబాబు సీఎం కావాలని, మదనపల్లె ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషా గెలవాలని గంగమ్మకు మొక్కుకున్న వలసపల్లె టీడీపీ నాయకులు మంగళవారం మొక్కుచెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తనయుడు జునైద్‌అక్బరి పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం 501 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున, తిరుమలప్ప, చెంగారెడ్డి, హరికుమార్, రమణ, సురేంద్ర, రవిప్రసాద్, మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్, స్టాకు పాయింట్‌ల పరిశీలన

నిమ్మనపల్లి, జూన్ 25: మండలంలోని స్థానిక ఎమ్మార్సీ భవనంలో విద్యార్థులకు కిట్, స్టాకు పాయింట్‌లను అన్నమయ్య జిల్లా ఏఎల్‌ఎస్‌సీవో చంద్రశేఖర్ పరిశీలించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి తప్పని సరిగా వారికి పరిపడా షూలు, బ్యాగులు, యూనిఫాం వంటి సామగ్రిని అందించాలన్నారు. అలాగే డ్రాప్ అవుట్‌లను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నారాయణ-2, తదితరులు పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు పంటలపై దృష్టి సారించండి



ఎద్దులవారిపల్లిలో పొలాలు పరిశీలిస్తున్న ఏడీ శివశంకర్

తంబళ్లపల్లి, జూన్ 25: రైతులు ప్రొద్దుతిరుగుడు పంటలపై దృష్టి సారించాల ని మదనపల్లి వ్యవసాయ శాఖ ఏడీ శివశంకర్ వెల్లడించారు. తంబళ్లపల్లి మం డలంలో మంగళవారం ఆయ న మండలం లోని కోటకొండ, కుక్కరాజుపల్లి, ఎద్దులవారిపల్లి ప్రాంతాల్లో సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించి పంటల సాగుపై సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ రైతులు పంట మా ర్పిడిలో భాగంగా నంద్యాల యూనివర్సిటీ నిపుణుల పరిశోధనలో 1012 రకం పొద్దుతిరుగుడు విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు కోసం మండలంలో మొత్తం 510 శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపాలని సిబ్బందికి తెలిపారు. మద నపల్లి డివిజన్‌లోని 8 మండలాల్లో 27,557 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు, 130 క్వింటాళ్ల కందులు, 700 క్వింటాళ్ల జనుము, 200 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు సబ్సిడీతో పంపిణీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఈ ఏడాది 300 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు విత్తనాలు ఉచితంగా అందుబటులో ఉంచినట్లు తెలిపారు. తంబళ్లపల్లి మండ లంలో 5,300 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేశా మని, 18 క్వింటాళ్ల కందులు పంపిణీకి సిద్దంగా ఉన్నట్లు వెల్లడిం చారు. ఆర్బీకేల్లో యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు .ఏవో రమణకుమార్, వీఏఏలు సురేష్, అంబేద్కర్, శిరీష, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ వైద్య సిబ్బందిపై విచారణ



ఫిర్యాదుల విషయమై వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌హెచ్‌ఎం అధికారి ఈశ్వర్

బి.కొత్తకోట, జూన్25: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని సచివాలయాలలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పనితీరు సరిగా లేదంటూ వెళ్లిన ఫిర్యాదుల మేరకు మంగళవారం నేషనల్ రూరల్ హెల్త్‌మిషన్ జిల్లా అధికారి ఈశ్వర్ విచారణ చేపట్టారు. పట్టణంలోని నాలుగవ సచివాయంలో సమావేశం నిర్వహించి, ఫిర్యాదుదారులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు సమన్వయం తో పనిచేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా స్త్రీశిశు సంక్షేమశాఖ అందిస్తున్న పౌష్టికాహారం, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. మరోఅధికారి సుగుణ, ఆశాలు, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణయ్య

కలికిరి, జూన్ 25: సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామకృష్ణయ్య సూచించారు. పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం అంశాలపై మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షా కాలం ప్రారంభమైనందు సీజనల్ వ్యాధులు సులభంగా వ్యాపిస్తాయని హెచ్చరించారు. దోమలు వ్యాప్తి చెందకుండా మురుగు నీటి కాలువలను శుభ్రం చేయాలని, తాగునీటి సరఫరా ట్యాంకులను 15 రోజులకోసారి బ్లీచింగ్‌తో శుభ్రపరచాలని చెప్పారు. సమావేశంలో ఈవోఆర్డీ పరశురామ్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకే బీసీజీ టీకాలు



బీసీజీ టీకాలపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

నిమ్మనపల్లి, జూన్ 25: క్షయవ్యాధి లేని సమాజం కొరకే పెద్దలకు బీసీజీ టీకాలను ప్రభుత్వం వేస్తోందని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫి, టీబీ పర్యవేక్షకుడు నాగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైద్యాధికారి రమేష్‌బాబు సూచనల మేరకు మండలంలోని బాలినాయునిపల్లి, సైదాపేటలో టీకాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించి ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ 60ఏళ్లు నిండిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు. బీడీ, సిగరెట్ వారికి టీబీ వచ్చి తగ్గినవారు తప్పనిసరిగా బీసీజీ టీకాలను వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, జూన్ 25: రోడ్డుప్రమాదంలో గాయపడిని యువకుడు మృతి చెందినట్లు తాలుకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె మండలం, వలసపల్లె పంచాయతీకి చెందిన షేక్ హబీబ్ కుమారుడు షేక్ సాకిబ్ (17) బసినికొండ సమీపంలోని లారీ బాడీ బిల్డ్ వర్క్‌షాపులో పని చేస్తాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరిన అతను రాత్రి8.30 గంటలకు పక్కన పార్కు చేసిన ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనంతో ఢీ కొట్టాడు. దీంతో తలకు గాయం కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించగానే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడి తండ్రి హబీబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైభవంగా ఉట్లోత్సవం



రామసముద్రం, జూన్ 25: రామసముద్రం మండలం మినికి గ్రామంలో వెలసిన కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగ ళవారం ఆలయ ప్రాంగణం లో ఉట్లోత్సవం కనులు పండుగగా వైభవంగా జరిగిం ది. ఆలయ ప్రధాన అర్చకు లు శ్రీధర్‌భట్టార్, సురేష్‌భట్టార్, ఆగమికులు త్రివిక్రమ్, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ఉట్లోత్సవం ప్రారంభించారు. ఈ ఉట్ల తిరుణాళ్ల తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు పాల్గొని ఉట్లోత్సవాన్ని తిలకించారు. ఈమహో త్సవం తిలకించడానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 25: దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసిన ట్లు తాలుకా సీఐ ఎన్. శేఖర్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మండలం లోని సీటీఎం క్రాస్ పంచాయతీ చిలకవారిపల్లెలో నివాసం ఉన్న సి. గంగాధ ర్(30)పై అదే గ్రామానికి చెందిన సి. లక్ష్మీకాంత్, సి.శ్రీనివాసులు, జి. గంగు లప్పలు గత ఏప్రిల్ 23న దాడి చేసి గాయపర్చారు. అనంతరం ఈ నెల 23 న గ్రామంలో గంగమ్మ జాతర నిర్వహిస్తుండగా హైదరాబాదు నుంచి స్వగ్రా మంకు వచ్చి గంగాధర్‌పై వారు మళ్లీ దాడి చేశారు. బాధితుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శివాలయంలో విశేష పూజలు

పెద్దతిప్పసముద్రం జూన్ 25 : పీటీఎంలో వెలసిన పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆధ్యాత్మిక వేత్త అయిన సనగరం పట్టాభిరామయ్య అధ్వర్యంలో అంగారక సంకటహర చతుర్థి ని పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం గణపతి హోమం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని అనేక రకాల పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బిల్లుల కోసం వాహన డ్రైవర్ల పడిగాపులు



జేసీ చాంబర్ వద్దనిరసన తెలుపుతున్న డ్రైవర్లు

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 25: ఎన్నికల విధుల కోసం వాడిన ప్రైవేటు వాహనాల డ్రైవర్లు బిల్లుల చెల్లించాలంటూ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని జేసీ చాంబర్ వద్ద పడిగాపులు కాశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల విధుల నిమిత్తం వాహనాలను బాడుగకు ఇచ్చి దాదాపు నెల రోజులు కావస్తున్నా ఇప్పటివరకు బిల్లులు మంజూరు చేయకపోగా, ఈ విషయంపై సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని పీలేరు నియోజక వర్గానికి చెందిన పలువురు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు పది రోజుల పాటు డ్రైవర్లను ఉపయోగించుకుని, కనీసం రూపాయి కూడా చెల్లించకుండా తిప్పుతున్నారని వారంతా మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్ ముందు నిరసన వ్యక్తం చేశారు. పీలేరుకు సంబంధించిన డ్రైవర్లకు దాదాపు పది లక్షల రూపాయల దాకా చెల్లించాల్సి ఉందని వారు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు పడిగాపులు కాసి చివరకు జాయింట్ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. ఈ విషయంపై జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ త్వరలో బిల్లులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు వెనుతిరిగి వెళ్లిపోయారు.

ప్రభుత్వ చౌక దుకాణం డీలర్ల రాజీనామా



డిప్యూటీ తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న డీలర్లు

వాల్మీకిపురం, జూన్ 25: వాల్మీకిపురం మండలంలోని ప్రభుత్వ చౌక దుకాణం డీలర్లు రాజీనామా చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో డీలర్లుగా వ్యవహరించిన వారు నేరుగా రెవెన్యూ అధికారులకు రాజీనామా ప్రతులని అందజేశారు. మండలంలోని గండబోయనపల్లె గ్రామానికి చెందిన చౌక దుకాణాలు 36 (రెడ్డెమ్మ), 37(సుమిత్ర), 44(రమాదేవి), కొత్త మంచూరు చౌక దుకాణాలు 31, శాఖంవారిపల్లెలో 32వ చౌక దుకాణం, మండలంలోని చింతపర్తి చౌకదుకాణం 18లకు చెందిన డీలర్లు తమ రాజీనామా పత్రాలను మంగళవారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్‌కు అందజేశారు. ఈసందర్భంగా డీటీ ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ డీలర్ల రాజీనామాలతో ఆయా గ్రామాలలో తాత్కాలికంగా మహిళా సంఘాలకు రేషన్ దుకాణాల విధులను అప్పగించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ నిరసన



ధర్నా చేస్తున్న కదిరి రోడ్డు వాసులు

ములకలచెరువు, జూన్ 25: స్థానిక కదిరి రోడ్డు వాసులు తాగునీటి సమస్యను పరిష్కరిం చాలంటూ మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ములకలచెరువు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నా కార్యక్రమంలో వారు ఖాళీ బిందెలతో కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తాగునీటి కుళాయిల పైప్‌లైన్ తొలగించడతంతో ఏడాదిగా తాగునీటి సమస్య ఏర్పడిందని, సమస్య పరిష్కరించాలని పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా ప్రయోజనం లేదని వాపోయారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అనసూయమ్మ, రంగమ్మ, రత్నమ్మ, మల్లమ్మ, మంజుల, కళావతి, లక్ష్మీభాయి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు

● టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, జూన్ 25: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీయనుందని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పేర్కొన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాలతో మంగళవారం మండలంలోని కోనేటివారిపల్లెలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే చంద్రబాబు ధ్యేయమన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, గ్రామ కమిటీ అధ్యక్షుడు తంబాళ్ల శివన్న, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ కేశవులు, నాయకులు ఉమాశంకర్, చలపతి, రెడ్డెప్ప, సాంబశివ, నరసింహులు, మోహన్, రెడ్డెప్ప, సాంబశివ, గురుమూర్తి, రఫీ, షబ్బీర్, మస్తాన్, రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



గుండె జబ్బులు పరీక్షిస్తున్న డాక్టర్ యశ్వంత్

రామసముద్రం, జూన్ 25: రామసముద్రం మండల కేంద్రంలోని బాబారెడ్డి కాంప్లెక్స్‌లో శ్రీవెంకటేశ్వర నర్సింగ్ హోం వెంకటాచల క్లీనిక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ వెంకటాలచం, గుండె సంబంధిత వైద్యులు ఎం.యశ్వంత్, కంటి వైద్యులు నాగశ్రీ సంబంధిత వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందించారు. కంటి ఆపరేషన్ అవసరమున్న వారికి ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కంటి వ్యాధి గ్రస్తులు 100మంది, గుండె జబ్బులున్న వారు 50మంది, సాధారణ వ్యాధి పరీక్షలకు సంబంధించి 250మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యులు తెలిపారు.

జాక్‌పాట్ విధానంపై చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

గుర్రంకొండ, జూన్ 25:గుర్రంకొండ మార్కెట్ యార్డులో రైతులను దోచుకుంటున్న జాక్‌పాట్ విధానంపై మార్కెట్ కమిటీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబశివ పేర్కొన్నారు. మంగళవారం గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంపై రైతులను అడిగి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంపై రైతులు పలుమార్లు ధర్నాలు చేసిన సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జాక్‌పాట్ అమలు రద్దు చేయాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేసి 20 రోజులు గడిచిన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. జాక్‌పాట్ విధానంపై చర్యలు తీసుకోకపో తే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని తెలిపారు.

టీడీపీ నేత ఎస్‌ఏ మస్తాన్‌కు మాతృవియోగం

మదనపల్లె టౌన్, జూన్ 25: టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్ తల్లి మహబూబ్‌బీ(77) సోమవారం రాత్రి మృతి చెందారు. స్థానిక ప్యారానగర్‌లో నివాసమున్న మహబూబ్‌బీ నాలుగు రోజులుగా అనారోగ్యంతో ఉండగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఈ క్రమంలో ఆమెకు గుండెపోటు రావడంతో మృతి చెందారు. మంగళవారం మదనపల్లెకు చెందిన టీడీపీ నాయకులు ఆర్‌జే వెంకటేశ్, భవానిప్రసాద్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తమ్ముడు జంషీర్, రాటకొండ గుర్రప్పనాయుడు, జనసేన నేత శ్రీరామరామాంజనేయులు, మున్సిపల్ కౌన్సిలర్లు బీఏ ఖాజా, ఇర్ఫాన్ తదితరులు మస్తాన్ తల్లి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

కబేళాకు తరలిస్తున్న గేదెల లారీని అడ్డుకున్న వీహెచ్‌పీ

కలికిరి, జూన్ 25: కబేళాకు గేదెలను తరలిస్తున్న ఒక లారీని స్థానిక విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు అడ్డుకున్నారు. మంగళవారం మండలం నుంచి లారీ ద్వారా 37 గేదెలను తరలిస్తుండగా సమాచారం అందుకున్న వీహెచ్‌పీ నాయకులు లారీని అడ్డుకుని గేదెలను దించేశారు. నిబంధనలకు విరుద్ధంగా కబేళాలకు తరలించడాన్ని ఉపేక్షించేది లేదన్నారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి చింతపర్తి మహేష్, జిల్లా గోరక్షక్ ప్రముఖ్ హరినాథ ప్రతాప్‌రాజు, మండల బీజేపీ కన్వీనర్ విబూది నరేష్, వీహెచ్‌పీ కార్యకర్తలు రమణ, మహీధర్, మహేష్, శ్రీనాథ్, విశ్వనాథ ప్రతాప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.